అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు సంప్రదించండి
ప్రచురించబడును. 93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com
# అక్షరకలం
తెలుగు దినపత్రిక
aksharakalam@gmail.com

అక్షరకలం తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా, జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

సంపుటి : 17 సంచిక : 245 | 16-10-2025 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

# బిసి ఐకాస ధర్నాకు సంపూర్ణ మద్దతు

- కాంగ్రెస్ ప్రయత్నంతో రిజర్వేషన్లు రావు
- రేవంత్ ప్రయత్నాల్లో చిత్తశుద్ధి లేదు
- పార్లమెంటులో బిల్లు పెడితేనే సాధ్యం
- బిజెపి, కాంగ్రెస్ పార్టీలతోనే ఇది సాకారం
- కృష్ణయ్యకు స్పష్టం చేసిన కెటిఆర్

బీసీ ఐకాస ధర్నాకు భారత రాష్ట్ర సమితి నైతిక మద్దతు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. బీసీ–ఐకాస ఆధ్వర్యంలో 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య, కమిటీ ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు బీసీల కోసం కేసీఆర్ ఎన్నో చేశారు. బీసీలకు లాభం జరగాలంటే పార్లమెంటులో బిల్లు చేయాలి.

2 లో..





## నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా

- ప్రజల వద్దకే వెళ్లి వారినే అడుగుతా
- ప్రజల్లో మమేకం కావడం ద్వారా దారివేస్తా
- జాగృతి జనం బాట చేపట్టిన కవిత
- పోస్టర్ ఆవిష్కరణలో సంచలన విషయాలు వెల్లడి

2 లో..

జాగృతి జనం బాట పేరుతో కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ రకంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా జాగృతిని తీసుకుని వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే ఇది బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా చేస్తున్న దండయాత్రగానే చూడాలి.



## పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానిస్తారా

- మాగంటి సునీతను అవమానించేలా మంత్రులు మాట్లాడుతారా
- చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ది చెప్పాల్సిందే
- కాంగ్రెస్, బిజెపిలు రాష్ట్రానికి చేసిందేమీ లేదు
- మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

2 లో..

## పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు

- జూబ్లీహిల్స్‌లో సునీత నామినేషన్‌లో పాల్గొన్న కెటిఆర్
- జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ విజయయాత్ర అన్న కెటిఆర్



వార్త 2లో



## వందేభారత్ 4.0 వర్షన్ అభివృద్ధి

కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

వార్త 2లో

## జూబ్లీహిల్‌లో నామినేషన్ వేసిన మాగంటి సునీత

### కెటిఆర్, తలసాని తదితరుల హాజరు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత గోపీనాథ్ తొలి సెట్ నామినేషన్ వేశారు. షేక్‌పేటలోని తహశీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు పద్మారావు, రావుల శ్రీధర్‌రెడ్డి, దీదీప్య రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, సమీనా యాస్మిన్‌తో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 21 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. నవంబర్ 11న ఉప ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. అదే నెల 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు.





## రాజేంద్రనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

### 4 పార్కులకు విముక్తి కలిగించినట్లు వెల్లడి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ పరిధిలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బద్వేల్–ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లో కబ్జాకు గురైన 4 పార్కులకు విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ 1, 2 హుడా అప్రూవల్ పేరుతో ఏర్పాటు చేసిన లేఔట్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జా జరిగినట్లు నిర్ధరించారు. ఈ క్రమంలో బుధవారం ఆక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ప్రహరీలు నిర్మించుకుని వేసిన షెడ్‌లు, రూమ్‌లను తొలగించారు.



## నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా

### రూ.13, 400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### ఎక్స్ వేదికగా మోడీ తెలుగులో ట్వీట్

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. అచ్చమైన తెలుగులో ఈ ట్వీట్ పెట్టారు ప్రధాని మోదీ. ఆంధ్రప్రదేశ్‌లో 'రేపు అంటే అక్టోబర్ 16వ తేదీన పర్యటిస్తాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో రూ.13, 400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవి ఉన్నాయని ప్రధాని మోదీ తన ట్వీట్ ద్వారా వెల్లడించారు.



## మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

### ఆస్ బయోటెక్ సదస్సుకు ఆహ్వానం

హైదరాబాద్, క్షరకలం ప్రతినిధి

తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. లైఫ్ సైన్సెస్ రంగంలో 'ఆసియా–పసిఫిక్' ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా పరిగణించే 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన కీలకోపన్యాసం చేయనున్నారు. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ ఈ మేరకు ఆహ్వానం పలికారు. దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు కావడం గమనార్హం. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సదస్సు జరగనుంది. ఈ రెండేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగించనున్నారు.





## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

2 లో..

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు.

# పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానిస్తారా

మాగంటి సునీతను అవమానించేలా మంత్రులు మాట్లాడుతారా

చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ది చెప్పాల్సిందే

కాంగ్రెస్, బిజెపిలు రాష్ట్రానికి చేసిందేమీ లేదు

మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్ చనిపోయారని... ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్‌కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్ లోకి చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసిందనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి..?.. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ..? అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని... జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు హరీశ్‌రావు. 'జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతని ఒడగొట్టాలని.. 20 వేల దొంగ ఓట్లను కాంగ్రెస్ కూడగట్టింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని అన్నారు. ప్రతి అక్కకు, చెల్లెకు కాంగ్రెస్ రూ.55,000 బాకీ పడింది. జూబ్లీహిల్స్‌లో మహిళలకు ఒక్కొక్కరికీ రూ.55,000 ఇచ్చి రేవంత్‌రెడ్డి సర్కార్ ఓటు అడగాలన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తా అన్నారని.. ఇవ్వకుండా మోసం చేశారు. ఒక అవ్వకు, తాతకు రూ.44,000 రేవంత్‌రెడ్డి బాకీపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిందేముంది.. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టుడు తప్ప అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రతి బస్తీకి బస్తీ దవాఖాన పెట్టారు. హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలని కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో గర్భిణులు డెలివరీకి పోతే ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి ఆటోలో ఇంటికాడ దిగబెట్టాం. రేవంత్‌రెడ్డి సర్కార్‌లో బతుకమ్మ చీరలు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇవ్వట్లేదు. కేసీఆర్ హయాంలో 20,000 లీటర్ల నీళ్లు ఉచితంగా ఇస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నల్లా బిల్లు వసూలు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో గరీబోళ్లకి నీళ్లు ఉచితంగా ఇచ్చాం. భాగ్యనగరంలో నల్లా సమస్యలు పెరిగాయి. అధికారులు నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ని జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓడిస్తేనే బుద్ధి వస్తుంది' అని హరీశ్‌రావు విమర్శించారు. 'తెలంగాణలో ఆరు గ్యారెంటీలని 100 రోజుల్లో అమలు చేస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో చెప్పించారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీలని పూర్తిగా అమలు చేయడం లేదు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రావడమే కష్టం. భర్తను కోల్పోయిన ఆడబిడ్డను మీరందరూ దీవించాలి. బీజేపీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటుంది. కానీ గోదావరి పుష్కరాలకు.. ఆంధ్రప్రదేశ్‌కి రూ.100కోట్లు ఇచ్చి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది. ఇది సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ ఎలా అవుతోంది..?. తెలంగాణ నీటిని దోపిడీ చేసే బనకచర్ల ప్రాజెక్టుకి బీజేపీ ప్రభుత్వం మద్దతిస్తోంది. అనుమతులు ఇస్తోంది. తెలంగాణకు ఏమి ఇస్తున్నారో బీజేపీ నాయకులు చెప్పాలి. దేశంలో 157 మెడికల్ కాలేజీలు ప్రకటిస్తే ఒక్క మెడికల్ కాలేజీని కూడా తెలంగాణకు ఇవ్వలేదన్నారు. 'తెలంగాణలో బీజేపీకి 8 ఎంపీలను గెలిపిస్తే.. రాష్ట్రానికి మీరు చేసిన మంచి ఇదేనా. గోధుమలకు రూ.2,585, వడ్లకు రూ.2,369 ఇస్తున్నారని... గోధుమలకు ఓ నీతి వడ్లకు మరో నీతి ఉంటుందా..?. అన్నారు. 2014లో బీజేపీ అధికారంలో వచ్చిన నాడు గోధుమలకు, వడ్లకు రూ.1400 మద్దతు ధర ఉండేది. గోధుమలకు మద్దతుధర పెంచి వడ్లకు పెంచకపోవడం తెలంగాణ రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. కాంగ్రెస్‌కి నిజాయితీ ఉంటే బాకీ కార్డు పంపిస్తాం. మీరు పడ్డ బాకీని చెల్లించి జూబ్లీహిల్స్‌లో ఓటు అడగాలని పేర్కొన్నారు. తెలంగాణ గొంతు నొక్కడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. ఆడపిల్ల పెళ్లికి కల్యాణలక్ష్మి, గర్భిణులకి కేసీఆర్ కిట్టు ఇచ్చాం. రూ.2000ల పెన్షన్ ఇచ్చి అవ్వాతాతల గౌరవం పెంచాం. షీ టీమ్స్‌తో ఆడపిల్లల భద్రత పెంచాం. కాంగ్రెస్‌వి మొసలి కన్నీళ్లు, ఆపద మొక్కులు తప్పా ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు.

## వందేభారత్ 4.0 వర్షన్ అభివృద్ది

కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

భారతదేశపు సెమీ–హై–స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0 ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చేదిశగా ఇది కీలక అడుగు కానుందని వెల్లడించారు. సీఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు. 11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా గంటకు 350 కి.మీ వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

# నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా

ప్రజల వద్దకే వెళ్లి వారినే అడుగుతా

ప్రజల్లో మమేకం కావడం

ద్వారా దారివేస్తా

జాగృతి జనం బాట

చేపట్టిన కవిత

పోస్టర్ ఆవిష్కరణలో సంచలన విషయాలు వెల్లడి



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జాగృతి జనం బాట పేరుతో కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ రకంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా జాగృతిని తీసుకుని వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే ఇది బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా చేస్తున్న దండయాత్రగానే చూడాలి. ఈ సందర్భంగా బుధవారం నాడు యాత్రపై మీడియాతో కవిత మాట్లాడుతూ.. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని.. ప్రతి జిల్లాల్లో రెండు రోజులు ఉంటామన్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని వర్గాల ప్రజలతో కలిసి మాట్లాడతామని చెప్పారు. జాగృతి జనం బాట పోస్టర్‌ను కవిత విడుదల చేశారు. పోస్టర్‌పై తెలంగాణ తల్లి, జయశంకర్ ఫోటోలు ఉన్నాయి. కేసీఆర్ ఫోటో లేకుండానే కవిత పోస్టర్‌ను విడుదల చేశారు. అంతేకాకుండా కేసీఆర్ ఫోటో తీసేయడానికి కారణాలు కూడా కవిత మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. సామాజిక తెలంగాణ కోసం ఏం చేయాలనే విషయాలను ప్రజల నుండే తెలుసుకుంటామన్నారు. సామాజిక తెలంగాణ అంటే నినాదం కాదు విధానమని వివరించారు. తాము ఉన్నన్ని రోజులు సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే గురువులన్నారు. పెద్ద పెద్ద నాయకులను కూడా ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారని గుర్తుచేశారు. ప్రజల దగ్గరికి వెళ్ళి సమస్యలు తెలుసుకుంటామని కవిత అన్నారు. కేసీఆర్ ఫోటో లేకుండానే యాత్ర చేస్తామన్నారు కవిత. కేసీఆర్ లేకుండా తెలంగాణ రాలేదని.. అయితే కేసీఆర్ ఫోటో పెట్టుకుంటే నైతికంగా కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు. 'నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా' అని అన్నారు కవిత. జాగృతి పెట్టినప్పుడు కూడా కేసీఆర్ ఫోటో పెట్టలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాగృతి పెట్టినప్పుడు జయశంకర్ ఫోటో పెట్టామన్నారు. కేసీఆర్‌కు పుట్టడం తన అదృష్టమని.. 'మా దారులు వేరే అయినప్పుడు నా లైన్ నేను తీసుకోవడం కరెక్ట్' అని అన్నారు. కేసీఆర్ ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారని.. ఆ పార్టీ నుండి తనను సస్పెండ్ చేశారని తెలిపారు. నైతికంగా కరెక్ట్ కాదనే కేసీఆర్ ఫోటో తీసేస్తున్నట్లు వెల్లడించారు. దుర్మార్గుల నుంచి చెట్టును కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశానని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. జాగృతి మొదటి నుంచి స్వతంత్రంగా పని చేసిందని.. కేసీఆర్ నుంచి ఒక్క ఆలోచన తీసుకోలేదన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత పార్టీతో జాగృతి అనుసంధానంగా పని చేసిందని వివరించారు. తన సస్పెన్షన్‌కు కారణాలను విశ్లేషించుకున్నానని తెలిపారు. పేగులు తెగేదాక తెలంగాణ కోసం కొట్లాడానని అన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నామని..సామాజిక తెలంగాణ సాధించుకోలేక పోయామని వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం మాట్లాడడం తప్పా అని ప్రశ్నించారు. ఏదో తప్పు మాట్లాడినట్టు చూపించి కుట్ర చేసి బయటకి పంపారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్న రంగం లేదన్నారు. అనేక సమస్యలు తెలంగాణను పట్టి పీడిస్తున్నాయన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారాన్ని పక్కన పెట్టి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్క రూపాయి కూడా తేలేకపోతున్నారని విమర్శించారు. పది సంవత్సరాల్లో తెచ్చిన ఫలితాలు ఇప్పుడు అందడం లేదని కవిత వ్యాఖ్యలు చేశారు. 'పార్టీ వద్దనుకున్నాక పదవి ఎందుకు. చాలా క్లారిటీతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశా. రాజీనామా చేసిన తర్వాత కూడా ఆమోదించడం లేదు. రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ రాజకీయం ఏంటో? పార్టీ పెట్టాలో లేదో ఇప్పటికీ క్లారిటీ లేదు. ప్రజలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాను. ప్రజలే గురువులు. కాబట్టి ఏం చేయాలో వారినే అడుగుతా. కేసీఆర్‌కు మచ్చ రాకుండా ఉండాలనే ప్రయత్నం చేశాను. కానీ నన్ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దారులు వేసినప్పుడు ధైర్యం ఉండాలి. బనకచర్ల, గోదావరి జలాలు లాంటి అన్ని అంశాలను మాట్లాడుతాం. యూరియా నుండి బస్సుల దాకా అన్ని రంగాల్లో సమస్యలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ చిన్న విషయం. ఉపఎన్నికతో జాగృతికి సంబంధం లేదు' అని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# పదేళ్ల అభివృద్దికి..రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు

జూబ్లీహిల్స్‌లో సునీత నామినేషన్‌లో పాల్గొన్న కెటిఆర్

జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ విజయయాత్ర అన్న కెటిఆర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీలు, ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న ఎన్నిక కాదని.. పదేండ్ల అభివృద్ధి, పాలనకి.. రెండు సంవత్సరాల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పదేళ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నికగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని.. ఆమె గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నారన్నారు. లక్షల మంది రైతన్నలు ఈమె గెలుస్తుందని ఆశిస్తున్నారని తెలిపారు. ఆ తర్వాతే తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎదురు చూస్తున్నారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు కోరుకుంటున్నారన్నారు. మూతపడుతున్న బస్తీ దావఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విషయాలు ప్రజలందరూ చూస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని.. కేసీఆర్ కట్టిన హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తుకు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని.. ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా వారిని అవమానపరిచిన మైనార్టీలు, ఈ ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ఒక అవకాశంగా భావిస్తున్నట్లుగా చెప్పారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, ఈ అంశంలో గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని.. దళితబంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారని.. తమ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మరోసారి పాలన రావడానికి, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పునాది కాబోతున్నదన్నారు. మరోసారి రాష్ట్రంలో గులాబీ పార్టీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కాబోతున్నదని.. అన్ని వర్గాల మద్దతుతో, అండతో మా పార్టీ అభ్యర్థి సునీత ఘన విజయం సాధించబోతున్నారన్నారు. రెండు సంవత్సరాల ఈ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రతి ఒక్కరూ మా పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి ఒక్కరికి, నియోజకవర్గానికి విశేషమైన సేవలు అందించిన నాయకుడు గోపీనాథ్ అన్నారు. హైదరాబాద్ నగరంలో అన్ని నియోజకవర్గాల్లో మా పార్టీ గెలుపొందిందంటే, అప్పటి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గోపీనాథ్ కృషి కూడా ఉందని.. గోపీనాథ్ అకాల మరణంతో బాధపడుతున్న కుటుంబాన్ని అందరూ ఆదుకోవాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నిర్ణయించి, ఆయన సతీమణి సునీత గోపీనాథ్ గారికి టికెట్ కేటాయించడం జరిగిందన్నారు. సునీతకు సహాయం కోసం పార్టీ కీలక నాయకులంతా పనిచేయాలని కేసీఆర్ ఆదేశించారని.. అందరి ఆశీర్వాదాలతో సునీత ఎన్నికల్లో గెలువబోతున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

ఖరారు చేసిన బిజెపి అదిష్టానం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అభ్యర్థి ఎంపిక కోసం నియోజకవర్గంలోని పలువురి సీనియర్ల పేర్లను బీజేపీ పరిగణలోకి తీసుకుంది. అందుకు సంబంధించిన జాబితాను రూపొందించి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు న్యూఢిల్లీ తీసుకు వెళ్లి.. బీజేపీ అధిష్టానం ముందు ఉంచారు. అధిష్టానం లంకల దీపక్ రెడ్డిని ఎంపిక చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్ పక్రియ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దాంతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. బుధవారం నామినేషన్ దాఖలు చేసారు. అంతకు ముందు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్.. ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే దూసుకు పోతున్నారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ బరిలో దిగి గెలిచారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన ఇటీవల మరణించారు.



దీంతో ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. తాజాగా ఉప ఎన్నిక పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆ క్రమంలో మాగంటి గోపీనాథ్ భార్య సునీతను బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా బరిలో దింపింది. అలాగే నవీన్ యాదవ్ పేరును కాంగ్రెస్ ఖరారు చేసింది. ఇక బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి తాజాగా ప్రకటించింది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగనుంది. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెల్లడి కానున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది ఆ రోజుతో తెలిపోనుంది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## బిసి ఐకాస ధర్నాకు సంపూర్ణ మద్దతు

కాంగ్రెస్ ప్రయత్నంతో రిజర్వేషన్లు రావు

రేవంత్ ప్రయత్నాల్లో చిత్తశుద్ది లేదు

పార్లమెంటులో బిల్లు పెడితేనే సాధ్యం

బిజెపి, కాంగ్రెస్ పార్టీలతోనే ఇది సాకారం

కృష్ణయ్యకు స్పష్టం చేసిన కెటిఆర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

బీసీ ఐకాస ధర్నాకు భారత రాష్ట్ర సమితి నైతిక మద్దతు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. బీసీ–ఐకాస ఆధ్వర్యంలో 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య, కమిటీ ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు బీసీల కోసం కేసీఆర్ ఎన్నో చేశారు. బీసీలకు లాభం జరగాలంటే పార్లమెంటులో బిల్లు చేయాలి. అసెంబ్లీలో చేసి నెపాన్ని ఇతరులపై నెట్టడం సమంజసం కాదు. బీసీల విషయంలో కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని శివపూజ. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు మాత్రమే సరిపోతాయా? రాజకీయ రిజర్వేషన్లతోపాటు అన్ని రకాలుగా మేలు జరగాలి. ధర్నాకు మద్దతు ఇస్తామంటున్న భాజపానే బిల్లు పెడితే అయిపోతుంది కదా అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం మాదిరే, సమస్యను ఢిల్లీ దాకా తీసుకువెళ్లి తెలంగాణ సాధించుకున్నట్లుగానే బీసీ రిజర్వేషన్లను సాధించుకుందాం. 18వ తేదీన బీసీ సంఘాలు నిర్వహించే బంద్‌కు మా పార్టీ మద్దతు ఇస్తుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రయత్నం మంచిది కాదు అని కేటీఆర్ హితవు పలికారు. పూటకో మాటతో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2004లో ఆర్ కృష్ణయ్యను తీసుకొని ప్రధానమంత్రి దగ్గరకి వెళ్లి కేసీఆర్ మూడు విషయాలు చెప్పారు. ఒకటి దేశంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలి, రెండు జనాభాకి అనుగుణంగా రాష్ట్రాలకు రిజర్వేషన్లు పెంచుకునే వెసులుబాటు కల్పించాలి, మూడు చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కావాలని కేసీఆర్ అడిగారు. భారత దేశ స్థాయిలో ఈ మూడు అంశాల మీద మాట్లాడిన మొట్టమొదటి నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లపైన మా పార్టీ విధానాన్ని చాలా స్పష్టంగా మా పార్టీ చెప్పింది. గతంలో శాసనసభలో రెండుసార్లు రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి పంపించింది. కానీ కాంగ్రెస్ పార్టీ లెక్క ప్రచారం చేసుకోలేదు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా రిజర్వేషన్లు పెడతామని శాసనసభలో చెప్పినప్పుడు మేము ఆ పార్టీ తరఫున మద్దతు ఇచ్చాము. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల పైన ఐదు రకాలుగా మాట్లాడుతోంది. రాజ్యాంగ సవరణ ద్వారా, పార్టీ తరఫున రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్స్ ద్వారా, బిల్లు ద్వారా, మరోసారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే బీసీ రిజర్వేషన్లు వస్తాయని చెప్పారు. ఇన్ని రకాలుగా మాటలు మార్చిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని మేము తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# గూగుల్ రాకతో మారనున్న విశాఖ

### దీని పెటటుబడులతో లక్ష మందికి పైగా ఉపాధి
### ఏఐకి సంబంధించి అనేక కంపెనీలు రాక
### చరిత్ర సృష్టించడం చంద్రబాబుకే సాధ్యం
### మీడియాతో ఐటిశ్యాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

**అమరావతి,**

గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చిందని.. ఇప్పుడు గూగుల్ పెట్టుబడులతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు.గూగుల్ పెట్టుబడితో లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు.. ఏఐకి సంబంధించిన అనేక కంపెనీలు విశాఖకు వస్తున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయి. చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబుతోనే సాధ్యం. ఆనాడు కియా ఏర్పాటుతో చరిత్ర సృష్టించాం. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెడుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అతిపెద్ద విజయం. నవంబర్‌లో మరిన్ని శుభవార్తలు ఉంటాయి. వైకాపా పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. డేటా సెంటర్ అంటే ఏంటో గతంలో పనిచేసిన మంత్రికి తెలుసా? నవంబర్ నుంచి విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు 13 పైసలు తగ్గేలా చర్యలు తీసుకుంటాం అని నారా లోకేశ్ తెలిపారు. సెప్టెంబర్ 2024లో గూగుల్ ప్రతినిధులు విశాఖ వచ్చినప్పుడు వారితో సమావేశమయ్యాను. వారికి డేటా సెంటర్ స్థలాన్ని చూపించాం. ఇది జరిగిన నెల రోజుల్లో యూఎస్ వెళ్లి గూగుల్ క్లౌడ్ నాయకత్వాన్ని కలిశా. నవంబర్‌లో గూగుల్ ప్రతినిధులు సీఎంను కలిశారు. ఇదే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు అనేకసార్లు భేటీ అయ్యారు. అనేక చర్చల తర్వాత ఇంత పెద్ద పెట్టుబడి సాధ్యమైంది. భారీ పెట్టుబడులపై అన్ని చోట్లా చర్చలు జరుగుతున్నాయన్నారు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం. అనంతపురం, కర్నూలుకు పంప్డ్ స్టోరేజ్, సిమెంట్ ఫ్యాక్టరీలు వస్తున్నాయి. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. శ్రీసిటీ గ్రేటర్ ఎకోసిస్టమ్‌లో అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. డైకెన్, బ్లూస్టార్, ఎల్జీ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ తీసుకొస్తున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. ఉత్తరాంధ్రలో టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. అన్ని ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం అని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. ఎంవోయూలపై సంతకాలు కాదు.. ఆచరణలో చేసి చూపిస్తున్నాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం. ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఛాలెంజ్‌గా తీసుకున్నాం. ఏ ఒక్క కంపెనీ కూడా మన రాష్ట్రం నుంచి వెళ్లే పరిస్థితి రాదు. గత ఐదేళ్లలో ఏపీలో విధ్వంసం జరిగింది. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్నాయి.. ఏపీలో మాత్రం డబుల్ ఇంజిన్ బు÷-లలెట్ ట్రైన్ ఉంది. ఢిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం చంద్రబాబు కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.



# మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

### డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రానికి ప్రయోజనాలు
### ఉమ్మడి కర్నూలు జిల్లా కూటమి నేతలతో బాబు టెలి కాన్ఫరెన్స్
### ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యటను విజయం చేయాలని పిలుపు

**అమరావతి,**

ప్రధాని మోడీ ఒకరోజు పర్యటనను విజయవంతం చేయాలని కూటమి నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం, కర్నూలు పర్యటనలను గ్రాండ్ సక్సెస్ చేద్దామన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ విధానాలతో రాష్ట్రానికి అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని తెలిపారు. ఏపీలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు, నంద్యాల, కర్నూలు జిల్లా కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో సీఎం మాట్లాడారు. కేంద్ర సహకారంతో అనేక పాలసీలు, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రానికి పెద్దఎత్తున లాభం చేకూరు తోందని అన్నారు. ఏపీలో గూగుల్ ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేసేందుకు ఢిల్లీలో నిన్న గూగుల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని ఇది చారిత్రాత్మక నిర్ణయమని హర్షం వ్యక్తం చేశారు సీఎం.



1998లో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రాకతో ఐటీ ఎకో సిస్టం ఏర్పడి.. నాలెడ్జి ఎకనామికి పునాది పడిందని గుర్తుచేశారు. ఏపీకి గూగుల్ డేటా హబ్ రావటంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్ చొరవ ఉందన్నారు. గూగుల్ రావడానికి ఐటీ మంత్రి లోకేష్ ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ ప్రతినిధులతో సంప్రదించి రాష్ట్రానికి వచ్చేలా చేశారన్నారు. అతిపెద్ద ఏఐ డేటా హబ్ ఏర్పాటుకు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ముందుకు వచ్చిందని.. దేశంలోనే ఇది అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని సీఎం పేర్కొన్నారు. విభజనతో ఎదుర్కొన్న ఇబ్బందుల కంటే గత పాలకులు చేసిన విధ్వంసంతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని వ్యాఖ్యలు చేశారు. పాలనా పరంగా అనేక తప్పులు చేశారని... వాటిని సరి చేయడానికే చాలా సమయం పట్టిందన్నారు. యోగాంధ్ర, అమరావతి రీస్టార్ట్ లాంటి కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు. ఇప్పుడు ప్రధాని మోదీ పాల్గొనే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేద్దామని పిలుపునిస్తున్నట్లు తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు ఆదా అవుతుందన్నారు. నెక్స్ జెన్ సంస్కరణలపై నెల్లాళ్లుగా విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తున్నామని.. సీమ జిల్లాలు ఉద్యావన పంటలకు కేంద్రంగా మారాయన్నారు. రాష్ట్రంలో పోర్టులు, రైల్వేల కనెక్టివిటీ ద్వారా సంపద సృష్టి జరుగుతోందని అన్నారు ముఖ్యమంత్రి. గత పాలకులు సీమలోని సాగునీటి ప్రాజెక్టులకు కనీసం 2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రాయలసీమ టూరిజం డెస్టినేషన్‌గా మారుస్తామని ప్రకటించారు. తిరుపతి, శ్రీశైలం, గండికోట లాంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే లక్ష్యంగా అంతా పనిచేయాలని సూచించారు. రేపు కూడా ప్రధాని రూ.13 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. కర్నూలులో జీఎస్టీపై ప్రధాని సభకు సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. గ్రామ స్థాయి నుంచి మూడు పార్టీల నేతలు సమన్వయంతో ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కూటమి నేతలంతా కలిసి ఓ మోడల్ స్టేట్‌గా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలని అన్నారు. ప్రధాని మోదీ రాకతో శ్రీశైల క్షేత్రానికి ఒక మహర్దశ రాబోతోందని చెప్పుకొచ్చారు. తిరుమల తర్వాత జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఉన్న క్షేత్రంగా శ్రీశైలం అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇక గూగుల్ సంస్థను ఏపీకి తేవటంలో సీఎం, మంత్రి నారా లోకేష్ కృషి ప్రశంసనీయమని టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు, నేతలు కొనియాడారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీగా గంజాయి పట్టివేత

**సంగారెడ్డి,**

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు కంకోల్ టోల్‌ఎ÷-లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 260 కిలోల గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పారిపోయేందుకు యత్నించగా.. నలుగురిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.1.30 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. వాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విషాదం

### ఇద్దరు చిన్నారులను చంపి ..తండ్రి ఆత్మహత్య

**కొత్తపేట,**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు చిన్నారులను చంపి తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలమూరు మండలం చిలకలపాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో ఎస్సై నరేశ్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని చేరుకుని పరిశీలించారు. ఇంట్లో పావులూరి కామరాజు (35), అభిరామ్ (10), గౌతమ్ (7) విగతజీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. కామరాజు గతంలో వాలంటీర్‌గా పనిచేశారు. 2020లో ఆయన భార్య ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి ఇద్దరు పిల్లలతో కలిసి కామరాజు ఉంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### నేటి ప్రధాని పర్యటన సెడ్యూల్ విడుదల
#### ప్రత్యేక విమానంలో నేరుగా కర్నూలుకు చేరిక

అమరావతి,

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం నాడు కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఖరారైంది. అధికారిక సమాచారం ప్రకారం.. ప్రధాని మోదీ గురువారం ఉదయం 10 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంట వెళ్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ ఉదయం 11.15 గంటలకు శ్రీ భమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుంటారు. స్వామివార్ల దర్శనం అనంతరం మధ్యాహ్నం 12.10 గంటలకు శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని ప్రధాని సందర్శిస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత ప్రధాని మోదీ మళ్లీ సున్నిపెంటకు చేరుకుంటారు. అటునుంచి హెలికాప్టర్‌లో నన్నూరు రాగ మయూరి గ్రీన్ హిల్స్ ఎలిప్యాడ్ వద్దకు వెళ్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత మధ్యాహ్నం 3 గంటలకు అక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. ఈ సభ అనంతరం 4.50 నిమిషాలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు వెళ్లి.. అక్కడి నుంచి ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు.

# అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి అస్తమయం

### అనేక చిత్రాల్లో పాటలు పాడిన ఘనత ఆమెది

**హైదరాబాద్,**

అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి (97) అనారోగ్యంతో హైదరాబాద్ మణికొండలోని స్వగృహంలో బుధవారం ఉదయం 8 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1928 ఆగస్ట్ 29న జన్మించిన రావు బాలసరస్వతి గొంతు ఆకాశవాణి




సంగీత కార్యక్రమాలతో తెలుగు వారికి సుపరిచితం. ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగు వారికి పరిచయమయ్యారు. 'సతీ అనసూయ' చిత్రంలో తొలి పాటను ఆలపించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో 2000కు పైగా పాటలు పాడారు. బాల సరస్వతి అసలు పేరు సరస్వతిదేవి. చిన్నప్పటి నుంచే పాటలు పాడడంతో అందరూ ఆమెను బాలసరస్వతి అని పిలిచారు. దీంతో ఆమెకు బాలసరస్వతిగా గుర్తింపు వచ్చింది. 'సతీఅనసూయ ధ్రువవిజయం' అనే చిన్నపిల్లలు నటించిన సినిమాలో గంగ పాత్రలో బాల సరస్వతి కనిపించారు. తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో పాటు నటనపై ఆసక్తి లేకపోవడంతో ఆ తర్వాత అవకాశాలు వదులుకున్నారు. సినిమాలలో తొలి నేపథ్య గాయనిగానూ ఆమె ఎంతో పేరు తెచ్చుకున్నారు. 'స్వప్నసుందరి, పిచ్చిపుల్లయ్య, పెళ్ళిసందడి, శాంతి, షావుకారు,



దేవదాసు, లైలా మజ్ను, భాగ్యలక్ష్మి, మంచి మనసుకు మంచి రోజులు' తదితర చిత్రాల్లో ఘంటసాల, ఏ.ఎం.రాజా, సౌందర్‌రాజన్, పిఠాపురం నాగేశ్వరరావు, జిక్కి, ఏ.పి. కోమల లాంటి వారితో కలిసి ఆమె పాటలు పాడారు. రావు బాల సరస్వతి అసలు పేరు సరస్వతి. తల్లి తండ్రుల పేర్లు విశాలాక్షి, కావేటి పార్థసారధి. ఆమె తండ్రి గాయకులు, ప్రధానంగా వీణ, సితారు వాయించేవారు. చెన్నై లో కొంత కాలం ఉండి అనంతరం గుంటురుకి మారారు. ఆలకూరు సుబ్బయ్య వద్ద బాల సరస్వతి 1939లో కర్ణాటక సంగీతం మూడు సంవత్సరాలు అభ్యసించారు. ఆపైన బాల సరస్వతిని ఆమె తండ్రి ముంబై తీసుకెళ్ళి, హిందుస్తానీ సంగీత ప్రముఖులైన ఖేల్కర్, సినీ సంగీత దర్శకులు వసంత్ దేశాయ్ వద్ద అభ్యాసం చేయించారు. అలానే మద్రాసులో పిచ్చుమణి అయ్యర్ దగ్గర ఆమె వీణ నేర్చుకున్నారు. సి. పుల్లయ్య దర్శకత్వం వహించిన 'సతీ అనసూయ'లో రావు బాలసరస్వతి గంగ వేషం వేశారు. ఆ యూనిట్ లో ఆమె చిన్నపిల్ల. దానికి ఆకుల నరసింహారావు సంగీత దర్శకులు. చిన్నప్పుడు పాటలు పాడటానికి వెళ్ళినప్పుడు ఆమెను బేబీ సరస్వతి అని పిలిచేవారు. ఆ తర్వాత బాల సరస్వతి అనడం మొదలు పెట్టారు. అదే చివరకు ఆమె పేరు అయిపోయింది. బాల సరస్వతి సుమారు 12 సినిమాలలో బాల నటిగా కనిపించారు. 1943లో ప్లే బ్యాక్ కొత్తగా వచ్చింది. దానికి ముందు ఎవరి పాటలు వారే పాడుకునే వారు. ఆ సమయంలో భాగ్యలక్ష్మి సినిమాకు మొట్టమొదటగా ప్లే బ్యాక్ పాడారు బాల సరస్వతి. పెద్దాయక ఆమె తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషా చిత్రాలలో పాటలు పాడారు. ముఖ్యంగా శ్రీశ్రీ, ఆరుద్ర, కొసరాజు, కృష్ణశాస్త్రి రాసిన పాటలను ఆమె ఎక్కువగా పాడారు. కోలంక జమీందారీకి చెందిన రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు ఆమెను 1944లో వివాహమాడారు. జమీందారీ కట్టుబాట్ల వల్ల, నటిగా సినిమాల్లో పాల్గొనడం తగ్గించారు. రాను రాను సినీ నేపథ్య గాయనిగా ఎన్నో అవకాశాలు వచ్చినా వదులుకోవాల్సి వచ్చింది. అయితే ఆమె ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో ఎన్నో లలిత గీతాలు ఆలపించారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ మొదలైన దక్షిణ భారత భాషల్లో సైతం ఎన్నో పాటలు పాడారు. 1974లో విజయనిర్మల దర్శకత్వం వహించిన 'సంఘం చెక్కిన శిల్పాలు' చిత్రంలో ఆమె పాట పాడారు. అదే సమయంలో సి. నారాయణరెడ్డి రాసిన మీరా భజన్స్ నూ గానం చేశారు. అష్టపదులు, తరంగాలు, జావళీలు, తెలుగు మీరా భజనలు, లలిత గీతాలను సాలూరి హనుమంతరావు, సాలూరి రాజేశ్వర రావు, రమేష్ నాయుడు, బాలాంత్రపు రజనీకాంత రావు, పెండ్యాల నాగేశ్వర రావు మొదలైన ప్రముఖ సంగీత కర్తల నిర్దేశకత్వరలో ఆమె పాడగా, ఆకాశవాణిలో అవి ప్రసారమయ్యాయి. సాలూరి రాజేశ్వరరావు తో పాడిన ప్రైవేటు గీతాల ఆల్బమ్స్ బాగా ప్రాచుర్యం పొందాయి. రావు బాలసరస్వతికి ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు వచ్చాయి. రామినేని ఫౌండేషన్, అజో విభో కందాళం ఫౌండేషన్, పాలగుమ్మి విశ్వనాథం స్మారక పురస్కారం ఇలా అనేక అవార్డులు లభించాయి.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# మమతా బెనర్జీ బాధ్యతా రాహిత్యం

**సమాజంలో రాక్షస ప్రవృత్తి పెరుగుతోంది. అత్యాచారాలు, హత్యలు, హత్యాకాండలు పెచ్చుమీరడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా వరుస ఘటనలు తీవ్రమైనవిగా పరిగణించాలి. ప్రభుత్వాలు ఈ తరహా నేరాలపై అధ్యయనం చేయాలి. కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఎపి, తెలంగాణ ఇలా అనేక రాష్ట్రాల్లో సభ్యసమాజం తలదించుకునేలా ఘటనలు జరుగుతున్నాయి. చివరకు చిన్నారి బాలలపైనా మూర్ఖులు లైంగికదాడులకు పాల్పడడం దారుణం. హైదరాబాద్‌లో, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలలపై ఉపాధ్యాయులే లైంగిక దాడికి తెగించడం దుర్మార్గపు చర్య. ఇలాంటి వారిని బహిరంగం గానే ఉరితీయాలి. ఇకపోతే మళ్లీ అక్కడక్కడా పరువు హత్యలు సాగుతున్నాయి. కులాలు, మతాలు కలవక పోవడంతో ప్రేమ పెళ్లిళ్లకు అడ్డుపడుతున్నారు. ఇలా సమాజంలో భయం లేకపోవడం వల్ల, చట్టాల్లో లొసుగుల వల్ల ప్రజల్లో రాక్షసత్వం పెరిగిపోతోంది. అత్యాచారాలు సులవుగా చేసేస్తున్నారు. దొంగతనాలు, హత్యలకు కొదువే లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖల్యు బాధ్యతా రహితంగా ఉన్నాయి. అత్యాచార ఘటనపై స్పందిస్తూ..అర్ధరాత్రి ఆ అమ్మాయి ఒంటరిగా ఎందుకు బయటకు వచ్చిందని పెడసరంగా ప్రశ్నించారు.**

ఒక సిఎంగా ఉన్న మమత మహిళ అయినా ఇలాంటి విషయాల్లో కనీస ఇంగితం లేకుండా మాట్లాడారు. కొన్నేళ్లుగా మహిళలపై నేరాల్లో బెంగాల్, కోల్‌కతా ముందువరసలో ఉంటున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో వార్షిక నివేదికలు ఘోషిస్తున్నాయి. దుర్గాపూర్ అత్యాచార దుర్ఘటనను ఖండిస్తూ మహిళలు, విద్యార్థులు, డాక్టర్స్ సంఘాలు, ఆరోగ్య కార్యకర్తల నుంచి రెండు రోజులుగా ఆందోళనలు పెల్లుబకగా, బాధ్యత కలిగిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత స్పందన బాధితు రాలిని, కుటుంబ సభ్యులను, యావత్ మహిళాలోకాన్ని కించపరిచింది. రాత్రిపూట క్యాంపస్ నుంచి బయటికి ఎందుకు వెళ్లింది, ఆ సమయంలో ఏం పని, అని సిఎం అసహనం చెందారు. ఏ సమయంలోనైనా బయటికి వెళ్లడం ప్రాథమిక హక్కు అయినప్పటికీ స్త్రీలు రాత్రుళ్లు రోడ్లపైకి రాకూడదని విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క మహిళ ఇంటి ముందు పోలీసులను కాపలాగా పెట్టలేమంటూ మహిళా భద్రతపై చేతులెత్తేశారు.పశ్చిమ బెంగాల్



దుర్గాపూర్‌లో ఐక్యూ ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థినిపై కాలేజీ క్యాంపస్ పరిసరాల్లో జరిగిన సామూహిక అత్యాచారం బెంగాల్‌లో మహిళా భద్రతా వైఫల్యాన్ని మరొకసారి బట్టబయలు చేసింది. ఒరిస్సాకు చెందిన విద్యార్థిని వైద్య విద్యనభ్యసించేందుకు ఆ కాలేజీలో చేరగా ఈ ఘోరం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితునితో కలిసి డిన్నర్‌కు క్యాంపస్ వెలుపలికి వెళ్లగా విద్యార్థినిని మృగాళ్లు అటకాయించి చేతిలోని ఫోన్‌ను లాక్కొని దగ్గరలోని దట్టమైన చెట్లలోకి బలవంతంగా లాక్కెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టారు. విషయం బయటికి చెబితే తీవ్రమైన పర్యవసానాలు ఉంటాయని దుండగులు బాధితురాలిని భయపెట్టారు. ఫోన్‌ను తిరిగి ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. కాగా విద్యార్థినిని డిన్నర్‌కు బయటికి తీసుకెళ్లిన యువకుడు మధ్యలోనే పరారయ్యాడని అంటున్నారు. అందుకే అతనిపైనా అనుమానాలు కలుగుతున్నాయి. అత్యాచారంలో ఈ ఫ్రెండ్ పాత్ర తెలియాలంటే పోలీస్ దర్యాప్తు ముమ్మరంగా జరగాలి. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని దుర్గాపూర్, కోల్‌కతా, బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. జాతీయ మహిళా కమిషన్ బెంగాల్‌లో మహిళలకు సరైన భద్రత కల్పించాలని మమత ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరుడు ఆగస్టులో ఆర్‌జి కర్ ఆస్పత్రిలో రాత్రిపూట వైద్య విధుల్లో ఉన్న లేడీ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఉదంతం సంచలనమైంది. ఆందోళనలతో బెంగాల్ రాష్ట్రం అట్టుడికింది. అయినా బెంగాల్లో మమతా బెనర్జీ పాలనతీరు మారలేదు. మహిళలకు రక్షణ కల్పించడం లేదు. అంటే మృగాళ్లకు భయం కలగడం లేదు. దీనికితోడు మమత చేసిన వ్యాఖ్యలు మృగాళ్లకు ఊతమిచ్చేలా ఉన్నాయి. ఏం మాట్లాడాలో కూడా తెలియని బాధ్యతారహిత నాయకులు ఉండడం సిగ్గుచేటు. ఆర్‌జికర్ ఆస్పత్రి వ్యవహారంలో అంతా మాయ జరిగింది. అసలు నిందితులను వదిలేసి ఓ అమాయకుడిని అందులో ఇరికించేశారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగానూ నిరసనలు మిన్నంటాయి. ఈ కేసులో సివిక్ పోలీస్ వలంటీర్ సంజరు రారుకి జీవిత ఖైదు పడింది. అసలు నిందితులను వదిలేశారని నేటికీ బాధితురాలి కుటుంబం పోరాడుతూనే ఉంది. ఆర్‌జి కర్ ఘోరాన్ని మరవకముందే దుర్గాపూర్ దారుణం సంభవించింది. ఈ ఏడాది జులైలో దక్షిణ కలకత్తా లా కాలేజీ విద్యార్థినిపై అత్యాచారం జరిగింది. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో కాలేజీ క్యాంపస్‌లలో విద్యార్థినులపై జరుగుతున్న వరుస అత్యాచారాలు విద్యా సంస్థలు, వాటి పరిసరాల్లో భద్రతా చర్యలపై డొల్ల తనాన్ని ప్రశ్నిస్తున్నాయి. పటిష్టమైన భద్రత, నిఘా, అప్రమత్తపు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. బిజెపిని విమర్శిస్తున్న మమతా బెనర్జీ తన ఏలుబడిలో బెంగాల్లో వరుస ఘటనలు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. అత్యాచారం వంటి దారుణాలు జరిగినప్పుడు ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు బాధ్యతగా ఉండాలి. బాధజతులకు న్యాయం జరుగుతుందన్న ఆత్మవిశ్వాసం వారిలో కలిగించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలాలి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కానీకుండా హెచ్చరికలు చేయాలి. మహిళలలో భయం పోగొట్టి భరోసా నింపాలి. ఇటువంటి స్పందనను ఒక మహిళా ముఖ్యమంత్రి నుంచి మహిళలు, ప్రజలు ఆశిస్తారు. కానీ మమత అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగనిపని.

## బిఆర్‌ఎస్‌లోకి పలువురు చేరిక

**హైదరాబాద్,**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో బీఆర్‌ఎస్‌లోకి చేరికలు ఊపందుకున్నాయి. నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అలీ మస్కతి, టీడీపీ సీనియర్ మహిళా నేత షకీలా రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే లక్ష్యంతోనే పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మస్కతి, షకీలారెడ్డి చేరికతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ చేరికల సందర్భంగా కేటీఆర్‌తో మాజీ మంత్రులు మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, పార్టీ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, రాజీవ్ సాగర్, తుంగబాలు తదితరులు ఉన్నారు.

## గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు

**హైదరాబాద్,**

గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలేనా..? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కమిషన్‌లు రావనే ఆయన గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా..? అని విమర్శించారు. హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడమే రేవంత్ అనుసరిస్తున్న సిద్ధాంతమా..? అని నిలదీశారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన ఉండదనడానికి గురుకులాలకు కేటాయించిన చాలీచాలని నిధులే ఉదాహరణ. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించి, గోరంతను కొండంతగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రూ.12 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డలు చదివే గురుకులాలకు కనీసం రూ.100 కోట్లు కేటాయించే మనసు లేదా..?' అని ప్రశ్నించారు. 'కమిషన్లు రావనే గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా? మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సిబ్బంది వేతనాలు, మోటార్ల మరమ్మతులు, అత్యవసర పనులు ఎలా సాధ్యం? చిత్తశుద్ధిలేని సమీక్షలతో గురుకులాలకు ఏం ప్రయోజనం? ఒకవైపు సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతుంటే తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించడం దుర్మార్గం. గురుకులాలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు? పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు, స్టిచ్చింగ్ ఛార్జీలు ఎప్పుడిస్తారు? అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అ÷-దదె బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు ఎప్పుడిస్తారు?' అని హరీశ్‌రావు నిలదీశారు. గురుకులాల మీద ప్రభుత్వానికి పట్టింపు ఉంటే విద్యార్థులు ఎందుకు నిరసనలు తెలియజేస్తున్నారు? బడిబాట పట్టాల్సిన విద్యార్థులను, ఆందోళన బాట పట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డీ మీ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతిని దిగజార్చారు. విష వలయాలుగా మార్చారు. అపఖ్యాతిని మూటగట్టుకున్నారు' అని మండిపడ్డారు. 22 నెలలుగా గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై అవసరమైన నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం డిమాండ్

**నాగర్‌కర్నూల్,**

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ అవినీతి అధికారి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జిల్లాలోని వంగూర్ మండలం మాచినోనిపల్లి గ్రామం టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన లైన్‌మెన్ తోట నాగేంద్ర మంగళవారం రూ.15 వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రైతులు లైన్‌మెన్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు మహబూబ్‌నగర్ పరిదిలోని ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం అధికారులు పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ లైన్‌మెన్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అవినీతికి పాల్పడే వారి సమాచారాన్ని ఏసీబీ టోల్ ఫ్రీ 1064 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. వాట్సప్ నంబర్ 9440446106కు తెలంగాణ ఏసీబీ ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

## కాకినాడ సెజ్ నుంచి రైతులకు భూముల అప్పగింత

**అమరావతి,**

కాకినాడ సెజ్ నుంచి రైతులకు భూముల అప్పగింత కొలిక్కి వచ్చింది. 2,180 ఎకరాలు తిరిగి రైతుల పేరిట రిజర్వేషన్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. డిప్యూటి సిఎం పవన్ చొరవతో సాకారం కావడం విశేషం. కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి సెజ్ పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. దీంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 1,551 మంది రైతులకు మేలు జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈ విషయంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తున్నట్లు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

## గూగుల్ రాకతో పెరిగిన ఎపి ప్రతిష్ట

**కర్నూలు,**

విశాఖపట్నానికి గూగుల్ ఏఐ హబ్ రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచుతుందని ఏపీ రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నానికి రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని అభివర్ణించారు. మంగళవారం కర్నూలు జిల్లాలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలని తీసుకువచ్చి హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారని.. ఇవాళ విశాఖకు గూగుల్‌ని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చుతున్నారని ప్రశంసించారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్థవంతమైన నాయకత్వం ఉండటంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు కష్టపడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులతో గంటల కొద్దీ చర్చలు జరిపి ఏపీకి పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ఏపీకి రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు వచ్చాయని వెల్లడించారు. గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని తెలిపారు. సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ నగరం.. నేడు ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## ఎక్స్ వేదికగా చంద్రబాబు ఆసక్తికర పోస్ట్

**న్యూఢిల్లీ,**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ వేదికగా చేసిన ఓ ఆసక్తికర పోస్ట్ అందరినీ ఆకర్శిస్తోంది. ఓకే గూగుల్..సింక్రనైజ్ ఫర్ వికసిత్ భారత్ అంటూ సీఎం ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఇక్కడ 'ఓకె గూగుల్' అనేది గూగుల్ అసిస్టెంట్ ను ప్రారంభించే వాయిస్ యాక్టివేటెడ్ ట్రిగ్గర్. దీన్ని వాడి సీఎం చంద్రబాబు నాయుడు పెట్టిన పోస్ట్ అందరిని ఆకట్టుకుంటోంది. అలానే 'గూగుల్ కమ్స్ టు ఏపీ'హ్యాష్ ట్యాగ్‌తో చేసిన పోస్టులో ఆయన పలువురు ప్రముఖులకు ట్యాగ్ చేశారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఏపీ సర్కార్ గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదర్చుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో ఓ ముఖ్య కార్యక్రమం జరిగింది. ఈ ప్రోగ్రామ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులతో పాటు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, గూగుల్ క్లౌడ్ ఆసియా ఫసిఫిక్ విభాగం అధ్యక్షుడు కరణ్ బజ్వాలు పాల్గొన్నారు. విశాఖలో రూ.87,520 కోట్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేయనుంది. ఒక గిగా వాట్ కెపాసిటీతో ఏఐ డేటా సెంటర్ ర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ డేటా సెంటర్ వైద్యారోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో సేవలు అందించనుంది.

## కల్తీమద్యం కేసులో ఎవ్వరినీ వదలబోం

విజయవాడలో మద్యం దుకాణాల్లో మంత్రి ఆకస్మిక తనిఖీలు విజయవాడ,అక్టోబరు14(ఆర్ఎన్ఎ):కల్తీ మద్యం అంటూ కుట్రకు తెరలేపిన ఏ ఒక్కరినీ వదలమని మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. కుట్రకు పాల్పడ్డ నిందితులు ఎక్కడ దాక్కున్నా పట్టుకొచ్చి శిక్షిస్తామని అన్నారు. శవరాజకీయాల్లో ఆరితేరిన జగన్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూ వైసీపీ నకిలీ మద్యం అంటూ ప్రజల్ని భయపెట్టాలని చూస్తోందన్నారు. వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై వాస్తవాలు అన్నీ బహిర్గతం చేస్తున్నామని తతెలిపారు. విజయవాడలో మద్యం దుకాణాల్లో మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ అమలును మంత్రి స్వయంగా పరిశీలించారు. యాప్ ఉపయోగాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో జోగి రమేష్.. చంద్రబాబు ఇంటికి వచ్చినందుకే వైసీపీ నేతలు డిపాజిట్లు కోల్పోయి పార్టీ అడ్రెస్ గల్లంతైందన్నారు. మళ్లీ చంద్రబాబు ఇంటికొస్తా అంటున్న జోగిరమేష్ కారుకూతలు కూస్తే తోలు తీస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర పన్నారని జనార్దన్ రావు స్పష్టమైన వాంగ్మూలం ఇచ్చారన్నారు. బందరు పిచ్చోడు పేర్ని నాని రాత్రులు ఆంబోతులా రంకెలు వేసి ఉదయం అదే పోలీసుస్టేషన్‌కు వెళ్లి గడ్డాలు పట్టుకోవటం చూశామన్నారు. ఇప్పటి వరకూ 19వేల మంది యాప్ డౌన్లోడ్ చేసుకున్నారని.. ఎక్సైజ్ విధానాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థను గాడిలో పెట్టామని.. శాఖాపరంగా ఎవరు తప్పు చేసినా వదిలి పెట్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## కదులుతున్న బస్సులో మంటలు

**జైసల్మేర్,**

రాజస్థాన్‌లోని జైసల్మేర్ లో మంగళవారంనాడు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. థైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదులుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు. బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపివేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని ఆర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.

## హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్

**చండీఘడ్,**

హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ప్రస్తుతం హర్యానా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఓం ప్రకాశ్ సింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు రాష్ట్ర డీజీపీగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు హర్యానా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారులు కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకో లేక హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆయన.. తన సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియా సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఈ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచే కాకుండా.. పూరన్ కుమార్ కుటుంబం నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. దాంతో రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియాపై ప్రభుత్వం ఇప్పటికే బదిలీ వేటు వేసింది. అలాగే డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై ప్రభుత్వం పంపించింది. దీంతో కొత్త డీజీపీగా తాత్కాలిక నియామకం అనివార్యమైంది. రో వైపు అక్టోబర్ 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్న పూరన్ కుమార్ కుటుంబం.. తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రముఖ రాజకీయ పార్టీల అధినేతలతో వరుస భేటీ అవుతుంది. ఈ ఆత్మహత్య కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని.. అలాగే పూరన్ కుమార్ మరణించే ముందు పేర్కొన్న ఉన్నతాధికారులను కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబం కోరుతుంది. పూరన్ కుమార్ భార్య అమ్నేతి కుమార్.. అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్ సమయంలో.. హర్యానా ముఖ్యమంత్రి నయిబ్ సింగ్ సైనీ సారథ్యంలోని ఉన్నతాధికారి బృందం విదేశాల్లో పర్యటిస్తుంది.

## హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది

**హైదరాబాద్,**

బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. తామంతా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నోటికాడ బుక్క ఎత్తిపోయిందన్నారు. ఇది తమను ఎంతగానో ఆందోళనకు గురిచేసిందన్నారు. మంగళవారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్.కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కోదండరాం మద్దతుతో బంద్ వందశాతం సక్సెస్ అయినట్లేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు కోదండరాం అని ప్రశంసించారు. తెలంగాణలోని రెండున్నర కోట్ల బీసీల హక్కుల కోసం ఈ బంద్ చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సమాజం ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్స్ కోసం బిల్లు రూపకల్పన చేశారని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీల నోటికాడి ముద్దను కొంతమంది లాక్కుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్స్ వ్యతిరేకులారా.. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. అఖిల పక్షాన్ని రాష్ట్రపతి, ప్రధానిని కల్పించాలని కోరారు. రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే.. వారి ఇళ్ల ముందు ధర్నా చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

స్పోర్ట్స్



# విండీస్‌తో రెండో టెస్టులో సిరాజ్ అరుదైన ఫీట్

హైదరాబాదీ ఏస్ పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టుల్లో అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. ఈ ఏడాది అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. సోమవారం నాలుగో రోజు వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హెూప్ వికెట్ ను తీసిన అనంతరం ఈ ఏడాది లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఓవరాల్ గా ఈ ఏడాది 8 మ్యాచ్ లు ఆడిన సిరాజ్.. 1575 బంతులు వేశాడు. రఫ్ గా చెప్పాలంటే 262.3 ఓవర్లను నిలకడగా బౌలింగ్ చేశాడు. మొత్తంమీద 37 వికెట్లను తీశాడు. అతని సగటు 26.91 కావడం విశేషం. ఓవరాల్ గా తను ఈ ఏడాది టెస్టుల్లో 39 మెయిడిన్లు వేశాడు. అలాగే 996 పరుగులను సమర్పించుకున్నాడు. తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన 6–70 కావడం విశేషం. ఇక 42.56 స్ట్రైక్ రేట్ తో 3.79 ఎకానమీ రేటుతో తను బౌలింగ్ చేశాడు. ఓవరాల్ గా తన ఖాతాలో రెండు నాలుగు వికెట్ల ప్రదర్శన, రెండు ఐదు వికెట్ల ప్రదర్శన ఉన్నాయి. వెస్టిండీస్ తో రెండో టెస్టు కుముందు 36 వికెట్లతో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. తను ఈ ఏడాది 9 మ్యాచ్ లు ఆడి, 276.4 ఓవర్లు వేశాడు. సగటు 28.63 కాగా, 47 మెయిడిన్లను వేశాడు. ఇక వెస్టిండీస్ తో జరుగుతున్న రెండో



టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ ను కొనసాగించిన వెస్టిండీస్ సోమవారం నాలుగో రోజు 118.5 ఓవర్లలో 390 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 121 పరుగుల టార్గెట్ ను నిర్దేశించింది. ఇక ఈ మ్యాచ్ లో నాలుగో రోజు బ్యాటింగ్ చేసి, ఓపెనర్ జాన్ క్యాంబెల్ (199 బంతుల్లో 115, 12 ఫోర్లు, 3 సిక్సర్లు), షాయ్ హెూప్ (214 బంతుల్లో 103, 12 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో సత్తా చాటారు. మూడో వికెట్ కు వీరిద్దరూ కలిసి 177 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో టీమిండియా ముందు 100o రన్స్ టార్గెట్ ఉంచగలిగింది. బౌలర్లలో కుల్దీప్ యాదవ్, జస్ ప్రీత్ బుమ్రాకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్.. ఆటముగిసేసరికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ (8) త్వరగా ఔటవగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (25 బ్యాటింగ్),



వన్ డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంకా విజయానికి భారత్ కు 58 పరుగులు కావాలి. తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన భారత్.. రెండు టెస్టుల సిరీస్ లో 1–0తో ఆధిక్యంలో ఉంది. మ్యాచ్ కు మంగళవారం ఆఖరిరోజు. దాదాపు లంచ్ విరామం లోపలే ఈ మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉంది. ఇక తొలి ఇన్నింగ్స్ ను భారత్ 5 వికెట్లకు 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జైస్వాల్ (175) టాప్ స్కోరర్ గా నిలిచాడు. మరోవైపు తమ తొలి ఇన్నింగ్స్ లో విండీస్ 248 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 270 పరుగుల లీడ్ ఇండియాకు దక్కింది.

# రెండో టెస్టులో భారత్ ఘన విజయం..

## 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్ పై విక్టరీ

## గిల్ కెప్టెన్సీలో 2–0తో తొలి సిరీస్ సొంతం

శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ నెగ్గింది. ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, పర్యాటక జట్టు విండీస్‌ను ఫాలో–ఆన్ ఆడించింది. తొలి టెస్టులో ఎదురైన సీన్ దాదాపు రిపీట్ అయింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు రెండో



ఇన్నింగ్స్ లో తమ పోరాటాన్ని చూపారు. ఈసారి చాలా ధైర్యంగా, నిలకడగా భారత బౌలర్లను ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే భారత్ ఛేదించడానికి 121 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఇచ్చింది విండీస్ జట్టు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా, భారత్ సునాయాసంగా విజయం సాధించింది.కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. కీలక సమయాల్లో నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ (100 పరుగులు) సాధించాడు. ఇప్పుడు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన స్కోర్‌ను ఛేజింగ్ చేసే క్రమంలో హాఫ్ సెంచరీ చేశాడు. 58 పరుగులతో మ్యాచ్ ముగించాడు. నిన్న మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ త్వరగా అవుట్ అయిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దాడు. తాజా ఇన్నింగ్స్ తో టెస్ట్ ఫార్మాట్‌లో రాహుల్ ఖాతాలో 20 అర్ధ సెంచరీలు, 11 సెంచరీలు ఉన్నాయి. సాయి సుదర్శన్ 76 బంతుల్లో 39



పరుగులు చేసి ఔటయ్యాడు. రెండో టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లోనూ 87 పరుగులతో రాణించాడు. ఫీల్డింగ్ లోనూ మెరిశాడు. మొదటి టెస్ట్‌లో 50 పరుగులు, ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో 129 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి కేవలం 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ విజయానికి కావాల్సిన పరుగులు చేశారు.విండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమిండియా ఎపెనర్ యశస్వి జైస్వాల్ 219 పరుగులతో సిరీస్‌ను టాప్ స్కోరర్‌గా ముగించాడు. రెండో టెస్ట్ మొదటి



ఇన్నింగ్స్‌లో అతను చేసిన 175 పరుగులు సిరీస్ లో అత్యుత్తమ స్కోరు. జైస్వాల్ తర్వాత కేఎల్ రాహుల్ (196 పరుగులు), శుభ్‌మన్ గిల్ (192) ఉన్నారు. వికెట్లలోనూ భారత బౌలర్లు



ఆధిపత్యం చెలాయించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ 12 వికెట్లతో అగ్ర స్థానంలో నిలవగా, ఆ తర్వాత స్థానాల్లో ఉన్న మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా వరుసగా 10, 8 వికెట్లు తీశారు.

# యశస్వి ఓపెనింగ్ చేస్తే రోహిత్‌ను మర్చిపోతారు

## మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా సంచలన వ్యాఖ్యలు

టీమ్?ఇండియాలో ఇప్పుడు యువ శక్తి మొదలైనట్లు కనిపిస్తోంది. లెజెండరీ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యంగ్ ప్లేయర్స్ మధ్య తీవ్రమైన పోటీ నడుస్తోంది. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో యంగ్ లెఫ్ట్ హ్యాండర్ అదరగొట్టే ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకుని, రోహిత్ శర్మకు అసలైన వారసుడు అతడేనని అందరితోనూ అనిపించుకున్నాడు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతడికి ఇంకా సమయం పడుతుందని పక్కనపెట్టారు. సరిగ్గా ఇదే టైమ్?లో టీమ్?ఇండియా మాజీ క్రికెటర్ ఒకరు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చి, అసలు సిసలైన



వారసుడు అతడు కాదు, మరొకడు ఉన్నాడని చెప్పి పెద్ద ట్విస్ట్ ఇచ్చాడు. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో తన ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన యంగ్ ప్లేయర్ అభిషేక్ శర్మ, రోహిత్ శర్మ స్థానానికి సరైనోడని చాలా మంది భావించారు. ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన సిరీస్‌కు కూడా అతడిని వెంటనే ఎంపిక చేయడంతో, ఆస్ట్రేలియాతో జరగనున్న మెయిన్ సిరీస్‌లో కూడా చోటు ఖాయమని ఊహాగానాలు మొదలయ్యాయి. 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, బీసీసీఐ రోహిత్ స్థానంలో అభిషేక్‌ను సిద్ధం చేస్తోందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతన్ని ఇంకా వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉంచి అందరికీ షాక్ ఇచ్చారు. అభిషేక్ తన అవకాశం కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పదని స్పష్టం చేశారు. అభిషేక్ శర్మ గురించి చర్చ జరుగుతున్న సమయంలో టీమ్?ఇండియాలో మాజీ ఓపెనర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ఒక కొత్త వాదనను తెరపైకి తెచ్చాడు. వన్డేల్లో రోహిత్ శర్మ తర్వాత ఓపెనింగ్ స్లాట్‌కు అభిషేక్ శర్మ కంటే ముందు యశస్వి జైస్వాల్ రేసులో ఉన్నాడని స్పష్టం చేశాడు. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌లో ఓపెనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న యశస్వి, త్వరలోనే అన్ని ఫార్మాట్లలో రెగ్యులర్ ప్లేయర్ అవుతాడని జోస్యం చెప్పాడు. "అభిషేక్ శర్మ గురించి చాలా చర్చ జరుగుతోంది, కానీ నా అభిప్రాయం ప్రకారం యశస్వికే మొదట అవకాశం ఇవ్వాలి. అతడిని ఎక్కువ కాలం పక్కన పెట్టలేరు" అని ఆకాశ్ చోప్రా గట్టిగా చెప్పాడు.ఆకాశ్ చోప్రా అంతటితో ఆగకుండా, ఒక సంచలన కామెంట్ చేశాడు. ఒకవేళ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ కలిసి వన్డేల్లో ఓపెనింగ్ చేయడం మొదలుపెడితే, వాళ్లిద్దరి దూకుడు ముందు ప్రేక్షకులు రోహిత్ శర్మను కూడా మిస్ అవ్వకపోవచ్చని అన్నాడు. "గిల్ ఇప్పటికే కెప్టెన్సీ బాధ్యతలతో ముందుకు వెళ్తున్నాడు. అతడితో పాటు యశస్వి ఓపెనింగ్ చేస్తే, ఆ కాంబినేషన్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అప్పుడు బహుశా రోహిత్ లేని లోటు కూడా ఎవరికీ తెలియకపోవచ్చు" అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో విశ్లేషించాడు. ఇది రోహిత్ ఫ్యాన్స్‌కు అంతగా నచ్చకపోయినా, టీమ్?ఇండియాలో ఫ్యూచర్ ప్లాన్స్‌కు అద్దం పడుతోంది.ఆకాశ్ చోప్రా కేవలం వన్డేల గురించే కాదు, టీ20 ఫార్మాట్ గురించి కూడా తన అంచనాలను పంచుకున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్ తర్వాత, టీమ్?ఇండియాలో టీ20 ఓపెనింగ్ స్లాట్‌లో పెద్ద మార్పులు జరగవచ్చని అన్నాడు. అప్పటికి, యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ ఇద్దరూ ఓపెనర్లుగా మారే అవకాశం ఉందని, అప్పుడు శుభ్‌మన్ గిల్‌ను నంబర్ 3 స్థానంలో ఆడించవచ్చని అభిప్రాయపడ్డాడు. యశస్వికి ఎప్పుడు అవకాశం వచ్చినా దాన్ని యూజ్ చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఒకసారి అతను జట్టులో స్థిరపడితే, ఇక ఇతరులను ఎవరూ మిస్ అవ్వరు. నెక్స్ట్ వరల్డ్ కప్ నాటికి అతను టీమ్‌లో రెగ్యులర్ స్టార్టర్ అవుతాడు అని ఆదిత్య చోప్రా తేల్చి చెప్పాడు.

# బాబర్ అజామ్ ఘోరంగా విఫలం

బాబర్ అజామ్ కష్టకాలం ఇప్పుడిప్పుడే ముగిసేలా లేదు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ ఘోరంగా విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 23 పరుగులకే ఔటయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోవడం గమనార్హం. రెండో ఇన్నింగ్స్‌లో బాబర్ అజామ్ 72 బంతులు ఆడి, 42 పరుగులు



చేశాడు. కానీ, ఆ తర్వాత కగిసో రబాడ చేతిలో ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోతున్న బాబర్ అజామ్ తీరు చూసి పాక్ జట్టు ఆందోళనకరంగా ఉంది.టెస్ట్ సెంచరీ కోసం బాబర్ ఆజం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 74 ఇన్నింగ్స్‌లలో ఒక్క టెస్ట్ సెంచరీ కూడా చేయలేదు. 2023 నుంచి అతని బ్యాటింగ్ సగటు కేవలం 23.75 మాత్రమే. బాబర్ ఆజంకు ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, అతని చివరి 28 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో, అతను కేవలం రెండు అర్ధ సెంచరీలు మాత్రమే సాధించాడు. అతను ప్రతిసారీ మంచి ఆరంభాలను పొందినప్పటికీ, వాటిని పెద్ద స్కోర్‌లుగా మార్చలేకపోతున్నాడు. అతని చివరి 15 ఇన్నింగ్స్‌లలో ఉత్తమ స్కోరు 42గా ఉంది.లాహోర్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో బాబర్ అజామ్ స్ట్రెయిట్ డెలివరీలతో అవుట్ అయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను %ూదీఔ%గా అవుట్ అయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో, ఆఫ్–బ్రేక్ బౌలర్ సైమన్ హార్మర్ అతన్ని %ూదీఔ%గా అవుట్ చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో, రబాడ యాంగిల్ చేసిన డెలివరీ అతన్ని స్టంప్‌ల మధ్య క్యాచ్ చేసింది. బాబర్ ఇన్‌కమింగ్ డెలివరీలతో ఇబ్బంది పడుతున్నాడని స్పష్టంగా తెలుస్తుంది. ఇది సాంకేతిక లోపం వల్ల కావొచ్చు. బాబర్ త్వరలో భారీ టెస్ట్ ఇన్నింగ్స్ ఆడకపోతే, అతను టీ20లలో ఎదుర్కొన్న పరిస్థితినే ఎదుర్కొవాల్సి ఉంటుంది.



# ప్రధాని పర్యటన కొత్త అవకాశాలకు ద్వారం

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నూతన దిశా నిర్దేశం సహచర మంత్రులతో సమీక్షించిన అచ్చన్నాయుడు



కర్నూలు,

ప్రధాని పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాల ద్వారమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజల్లో ఉత్సాహం నింపి సభను చారిత్రాత్మకంగా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రధాని పర్యటన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నూతన దిశా నిర్దేశం అవుతుందని మంత్రిపేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సహచర మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి , కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష జరిపారు. వేదిక, భద్రత, పార్కింగ్, నీటి సదుపాయాలపై చర్చించారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. ప్రతి శాఖ అధికారులు, కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సక్రమ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సభ విజయవంతం కోసం క్షేత్రస్థాయిలో సమర్థ ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. ప్రధాని మోదీ నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కర్నూలు ఎయిర్ పోర్టుకు రానున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో సుండిపెంట వెళ్లనున్నారు ప్రధాని. రోడ్డు మార్గంలో శ్రీశైలం భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 11.15 గంటలకు శ్రీశైలం ఆలయంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను మోదీ దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.10 శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం సుండిపెంటకు చేరుకొని అక్కడ నుంచి హెలికాప్టర్ లో నేరుగా నన్నూరు రాగ మయూరి గ్రీన్ హిల్స్ హెలీప్యాడ్ కు వస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రధాన మంత్రి బహిరంగ సభ జరగనుంది. సాయంత్రం 4:05 గంటలకు కార్యక్రమం ముగించుకుని కర్నూలు ఎయిర్ పోర్ట్‌కు చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు.



## 108 అత్యవసర సేవలు పకడ్బందీగా నిర్వహించాలి: ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు



మిర్యాలగూడ అక్టోబర్ 15 అక్షర కలం

జిల్లా వ్యాప్తంగా 108 అత్యవసర సేవలు నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని వెహికల్స్ లో ఉన్నటువంటి సదుపాయాల పని తిరుని ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం తిప్పర్తి వెహికల్ ఆడిట్ చేశారు.అందులో భాగంగా అత్యవసర సేవలలో 108 యొక్క ప్రాధాన్యత మరియు ఔషధాల తనిఖీ ఎక్విప్మెంట్స్ వాటి యొక్క పనితీరుని పైలెట్ శ్రీను ఈఎంటి రమ్యను తెలుసుకొని తగు రీతిలో చెక్ చేయడం జరిగింది.నల్గొండ డిస్టిక్ ప్రోగ్రాం మేనేజర్ ఎస్ కే సలీం ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ మధు ఆధ్వర్యంలో 24/7 అత్యవసర సర్వీసు ప్రజలు వినియోగించుకోవాలని చెప్పడం జరిగింది.

## బిసి జపం చేస్తూ..ప్రజలకు మోసం

### మరోమారు కిషన్ రెడ్డిపై రాజాసింగ్ విమర్శలు

హైదరాబాద్, ’ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం తాజాగా మరోసారి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.. తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడల్లా లేదా ప్రముఖ నాయకుడు వచ్చినప్పుడల్లా, భవిష్యత్తులో ఒక బీసీ తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అంటారు. తెలంగాణలో చిన్న ఎన్నికల గాని పెద్ద ఎన్నికల గాని వస్తే బీసీలనే మర్చిపోతారని రాజాసింగ్ ఆరోపించారు. బీసీలు మన తెలంగాణ భారతీయ జనతా పార్టీ లోపట ఎక్కడున్నారో కొద్ది చెప్తారా కిషన్ రెడ్డి. నేను ఇంతకు ముందు ఎప్పుడూ ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు లేదా ఓబీసీల గురించి మాట్లాడలేదు. నేను హిందూత్వం గురించి మాత్రమే మాట్లాడుతాను. కానీ నేను ఈరోజు దాని గురించి మాట్లాడటానికి కారణం మీరు ప్రతి ఎన్నికల్లో బీసీ కార్డును ప్లే చేసి, బీసీ సమాజానికి మీరు మోసం చేస్తారు. అందుకే నేను ఈరోజు చెప్పాల్సి వచ్చింది.’ అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ మాటల తూటాలను వదిలారు. మంగళవారం కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపణలు చేశారు. ’కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిజీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీరు ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారు? జూబ్లీ హిల్స్ ప్రజలు మిమ్మల్ని అడుగుతున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తారా? కాంగ్రెస్‌ను గెలిపిస్తారా..? అని సోషల్ మీడియాలో మిమ్మల్ని జనాలు అడుగుతున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. మీ గౌరవం ప్రమాదంలో ఉందా ’ అని రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు.

## కుట్రలు అన్నీ కృష్ణా జిల్లా నుంచే ..

కూటమి ప్రభుత్వంలో అద్భుతమైన అభివృద్ధి

కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి కొల్లు రవీంద్ర భేటీ

విజయవాడ,

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. వైకాపా నేతలు రాష్ట్రంలో అస్థిరత తీసుకురావాలని చూస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు అన్నీ కృష్ణా జిల్లా నుంచే జరగడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. నకిలీ మద్యం కేసు, జిల్లాలో తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అన్ని మద్యం దుకాణాల వద్ద లిక్కర్ చెకింగ్ డివైజ్ పెడుతున్నామని, సామాన్యుడు కూడా తనిఖీ చేసుకోవచ్చన్నారు. సహజ మరణాలను కూడా లిక్కర్ మరణాలుగా చూపించి.. ప్రజలను భయాందోళనలకు గురిచేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ జే బ్రాండ్స్ పెట్టి నకిలీ మద్యంతో దోపిడీ చేశారని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుంటే.. వైకాపా దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం కేసులో నిందితుడు అద్దేపల్లి జనార్ధనరావు జైల్లో ఉండగా.. జోగి రమేశ్ పేరు చెబుతాడని ఎలా తెలుసని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రశ్నించారు. జోగి రమేశ్ తన సొంత సామాజికవర్గం వారి దగ్గర డబ్బులు తీసుకుని షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పించాడని ఆరోపించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సీనియర్ నేత నెట్టెం రఘురాం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



## పరకామణి దొంగలు బయటకు వస్తారు: భాను ప్రకాశ్

తిరుపతి,

వైకాపా హయాంలో తిరుమలలో నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరించారని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. పరకామణి వ్యవహారం ఇందులో భాగమన్నారు. తిరుమలను తమ ఆదాయవనరుగా మార్చుకుని శ్రీవారికే శఠగోపం పెట్టారని మండిపడ్డారు. వారి పాపం పండిందని అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తితిదే ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి చేయకూడని పనులన్నీ చేశారని ఆరోపించారు. 2023లో పరకామణి కేసును పక్కదారి పట్టించారు. కేసును లోక్ అదాలత్‌కు పంపడంలో భూమన కీలకపాత్ర పోషించారు. అధికారులపై తీవ్ర ఒత్తిడితో లోక్ అదాలత్‌లో రాజీ చేయడం దారుణం. హుండీని దోచేసిన వ్యక్తి ఆస్తులను బలవంతంగా రాయించుకున్నారు. పరకామణి కేసులో అసలు పాత్రధారులు త్వరలో బయటపడతారని పేర్కొన్నారు. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందన్నది త్వరలో తేలుతుందన్నారు.

## రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం

ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలన ఆదేశం

న్యూఢిల్లీ

రాహుల్ చేసిన ఓట్ చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు భాజపా నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు. తాజాగా దీనిపై పిల్ వేయగా సుప్రీం తిరస్కరించింది. ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు.

## న్యాయ వ్యవహారాల్లోనూ సాంకేతికత

హైదరాబాద్,

న్యాయరంగంలో సాంకేతికత విపరీతంగా పెరిగిందని.. ఇప్పుడు టెక్నాలజీ వాడి న్యాయపరమైన పత్రాలు రాయొచ్చు, అనాలిసిస్ చేయొచ్చని మంత్రి వివేక్ అన్నారు. టెక్నాలజీ తో పాటు హ్యూమానిటీ ఉండాలని.. ఎందుకంటే హ్యూమానిటీ లేకపోతే దీర్ఘకాలం ఏ రంగంలో నిలబడలేమని అన్నారు. బాగ్ లింగంపల్లిలోని అంబేద్కర్ లా కాలేజీలో విద్వత 2025 లా ఫెస్ట్ కి ముఖ్య అతిధిగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. అక్టోబర్ 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న లా ఫెస్టివల్‌ను మంత్రి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 1990లలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు 2020లలో పూర్తిగా మారిపోయాయని... న్యాయరంగంలో కూడా న్యాయమూర్తుల దృక్పథం, న్యాయవాదుల వైఖరి మారుతోందని అన్నారు. మనం కూడా వాటికి అనుగుణంగా మారాలని అన్నారు. నేను స్వయంగా ఒక ఇండస్ట్రియలిస్ట్ ని.. 5 లక్షల పెట్టుబడితో ప్రారంభించి, 2 వేల కోట్ల వ్యాపారం వరకు తీసుకువచ్చానని అన్నారు. ఇది సాధ్యమైంది కేవలం కష్టపడి, నిజాయితీగా పనిచేయడం వల్లే అని అన్నారు మంత్రి వివేక్. నేను మెడిసిన్ డాక్టర్, ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు.. అయినా కానీ కామన్ సెన్స్, కష్టపడి పనిచేయాలనే ఆసక్తి వల్లే సాధించ గలిగానని అన్నారు.. ఏ రంగంలోనైనా విజయం కావాలంటే కష్టపడా లని, నిజాయితీగా ఉండాలని, మనుషుల సమస్యలు అర్థం చేసుకోవాలని అన్నారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక





# నల్ల బంగారంగా సంయుక్త

విరూపాక్ష, సార్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ మందారం సంయుక్త మీనన్ త్వరలో 'బ్లాక్ గోల్డ్'గా తెరపైకి రానున్నది. 'చింతకాయల రవి' చిత్రంతో దర్శకునిగా పరిచయమైన యోగి చాలా విరామం తర్వాత ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇదో లేడీ ఓరియెంటెడ్ మూవీ. ఈ సినిమాకు ముందు భైరవి, రాక్షసి అనే పేర్లు పరిశీలించారు. వాటికంటే 'బ్లాక్ గోల్డ్' అయితే.. జనంలోకి తేలిగ్గా వెళ్తుందన్న ఆలోచనతో దీన్ని ఫిక్స్ చేసినట్టు సమాచారం. సినిమా దాదాపుగా సగంపై పూర్తయింది. ఓ గ్లింప్స్ కూడా సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఆ గ్లింప్స్‌తోపాటే టైటిల్‌ను కూడా రివీల్ చేసే అవకాశం ఉంది. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# అరి కథతో పుస్తకం

'అరిషడ్వర్గాల గురించి ఎంతో మంది గొప్పవాళ్లు చెప్పారు కానీ.. వాటిని జయించడానికి పరిష్కారాలను చూపించలేదు. మా సినిమాలో ఆ ప్రయత్నం చేశాం. ఈ సినిమా కథతో త్వరలో ఓ పుస్తకాన్ని తీసుకొస్తున్నాం. ఈ చిత్రానికి విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి ఆదరణ దక్కుతున్నది' అని చెప్పారు దర్శకుడు జయశంకర్. ఆయన నిర్దేశకత్వంలో రూపొందిన 'అరి' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. వినోద్‌వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటించారు. మంగళవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు జయశంకర్..ఈ సినిమా ఇప్పుడే ఓటీటీలోకి రావడం లేదని, థియేట్రికల్ రన్ పూర్తయ్యాకే ఓటీటీ డేట్ ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.





# హత్య కేసుల శోధనలో..

విష్ణు విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 31న శ్రేష్ఠమూవీస్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం విడుదలకానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి 'ఐయామ్ ది గాయ్' అనే పాటను విడుదల చేశారు. జిబ్రాన్ స్వరపరిచిన ఈ పాటకు సామ్రాట్ సాహిత్యం అందించారు. శ్రీకాంత్, హరిహరన్ ఆలపించారు. ఆద్యంతం ఉత్కంఠను పంచే పరిశోధనాత్మక చిత్రమిదని, ఐదు రోజుల్లో జరిగే వరుస హత్యల తాలూకు కేసులను ఓ పోలీస్ అధికారి ఎలా ఛేదించాడన్నది ఆసక్తికరంగా సాగుతుందని మేకర్స్ తెలిపారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానసచౌదరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, నిర్మాతలు: శుభ్ర, ఆర్యన్ రమేష్, విష్ణు విశాల్, దర్శకత్వం: ప్రవీణ్ కె.



# బూతు అనేది వారి దృక్కోణం

'ఈ కథ వినగానే నాకూ బాగా నచ్చింది. ఇందులో హీరో పాత్ర పేరు కుమార్. ఆ క్యారెక్టరైజేషన్ నన్ను ఆకట్టుకుంది. ముందుగా ఈ సినిమాకు 'కుమార్ ర్యాంప్' అనే టైటిల్ అనుకున్నాం. అది కాస్త లెన్తీగా ఉందని 'కె-ర్యాంప్' అని ఫిక్స్ చేశాం. కొందరికి ఇది బూతులా అనిపించొచ్చు. అది వారి దృక్కోణం. కిరణ్ హిట్ సినిమా 'క'కు తొలి అక్షరం '%ఖ%' కాబట్టి అది కూడా సెంటిమెంట్‌గా భావించాం.' అని నిర్మాత రాజేశ్ దండా అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా జైన్స్ నాని దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'కె-ర్యాంప్' చిత్రం ఈ నెల 18న విడుదల కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించిన ఆయన.. పై విధంగా స్పందించారు.



# ఏజెంట్ మిర్చి సస్పెన్స్?

అచ్చ తెలుగందం శ్రీలీలకు చేతినిండా సినిమాలున్నాయి. అవన్నీ భారీ ప్రాజెక్ట్‌లే. ఈ ఏడాది 'తూ మేరీ జిందగీ హై' చిత్రం ద్వారా హిందీలోకి కూడా అడుగుపెట్టి పాన్ ఇండియా రేంజ్‌లో సత్తా చాటుతున్నది. సక్సెస్‌ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా ఈ భామకు భారీ ఆఫర్లు రావడం..యువతలో ఆమె క్రేజ్‌కు నిదర్శనంగా చెబుతున్నారు.ఈ నేపథ్యంలో శ్రీలీల తన సోషల్‌మీడియాలో షేర్ చేసిన ఓ పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'త్వరలో..ఏజెంట్ మిర్చిగా శ్రీలీల' అంటూ ఆ పోస్టర్‌పై క్యాప్షన్ కనిపిస్తున్నది. ఈ స్టిల్‌లో శ్రీలీల గాగుల్స్ ధరించి ట్కస్టైలిష్‌గా కనిపిస్తున్నది. దీంతో ఇది కొత్త సినిమా తాలూకు పోస్టరా? లేక ఏదైనా ఓటీటీకి సంబంధించిన షోనా అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.అయితే ఈ పోస్టర్ తాలూకు మరిన్ని వివరాలను ఈ నెల 19న వెల్లడిస్తానని శ్రీలీల హిం ట్ ఇవ్వడంతో..ఈ సస్పెన్స్ వీడాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే అనుకుంటున్నారు అభిమానులు.

# చేయుత పథకం ద్వారా అందే సామాజిక పింఛన్ల పై అవగాహన కల్గి ఉండాలి....- కలెక్టర్ రాహుల్ రాజ్.....




**మెదక్, అక్టోబర్ 15 (అక్షర కలం):-**



చేయూత పథకం ద్వారా అందే సామాజిక పింఛన్ల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు ఎంసీఎస్ లు,పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, పోస్టల్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ చేయూత పథకం ద్వారా అందే సామాజిక పింఛన్లు వృద్ధాప్య, వితంతు, వ్యాధిగ్రస్తుల, సామాజిక ఆర్థికంగా ,వెనుకబడిన వారికి ఇచ్చే పింఛన్ల పై గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉన్న అధికారులందరి కీ అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ పింఛన్ల గల అర్హతలు ఏమిటి, పింఛన్లకు గల నిబంధనలు ఏమిటి అనేది కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. ప్రతి సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమానికి అనేకమంది వివిధ రకాల పింఛన్ల కోసం కలెక్టర్ కార్యాలయం రావడం తరచూ మేము చూస్తున్నామని, వారిని గ్రామాల్లో ,మండల స్థాయిల్లో అవగాహన కల్పించి ,అర్హత గల వారిని అందరికి పింఛను వచ్చేలా కృషి చేయాలని అధికారులకు తెలిపారు. వివిధ పింఛన్లకు గల అర్హతలను వాటి విధివిధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పి సీఈఓ ఎల్లయ్య, సెర్ప్ డైరెక్టర్ (పింఛన్లు) గోపాల్ రావు,డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీవోలు, ఎంసీఎస్ లు, పంచాయతీ కార్యదర్శులు ,బిల్ కలెక్టర్లు, పోస్టల్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15:**





2025-26 ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాలు, వ్యవసాయ, రవాణా, ఎఫ్సిఐ శాఖల కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖరీఫ్ 2025 - 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలని తెలిపారు. వానాకాలంలో 66 లక్షల 80 వేల ఎకరాలలో ప్రతిపాదిత వరి సాగు జరిగిందని, దాదాపు 148 లక్షల మెట్రిక్ టన్నుల వంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర, సన్న రకం వడ్ల బోనస్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే సమయంలో లోతట్టు ప్రాంతాలలో ఉండకుండా చూసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో త్రాగునీరు, నీడ ఇతర కనీస వసతులు కల్పించాలని, అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, సరిపడా హమాలీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం వరి ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం వేరు వేరు గన్నీ సంచులలో సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. ప్యాడి క్లీనర్లు, తేమ శాతం పరికరాలు, హస్క్ రిమూవర్ లు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని, తూనికలు కొలతల శాఖ అధికారులతో ధ్రువీకరించుకోవాలని తెలిపారు. వరి ధాన్యం తరలింపుకు అవసరమైన గన్నీ సంచులు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారుల ఆధ్వర్యంలో హార్వెస్టర్ వాహనంలో బ్లోయర్ యాక్టివ్ మోడ్ లో ఉండి ఆర్పిఎం 18- 20 ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి సిఎంఆర్ కు సంబంధించిన బ్యాంకు గ్యారంటీలు, ఒప్పందాలు సిద్ధం చేసుకోవాలని, కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రైతులకు కొనుగోలు సమయంలో తలెత్తే ఇబ్బందులపై ఫిర్యాదులు స్వీకరించాలని, హెల్ప్ లైన్ నెంబర్ ను ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రదర్శించాలని తెలిపారు. వాతావరణ సూచనలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించాలని, రిజైండర్లు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా అన్ని శాఖల సహకారంతో వరి ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం జరుగుతుందని, కనీస మద్దతు ధర చెల్లించి రైతులకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని, గన్ని సంచులు, టార్పాలిన్లు, రవాణా తదితర సౌకర్యాలు కల్పించాలని, పత్తి, మొక్కజొన్న, సోయా సాగు చేసిన రైతులకు కూడా కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిర్ణీత వ్యవధిలో చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థి



**అక్షర కలం, మందమర్రి, అక్టోబర్ 15:**

పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ (మోడల్) పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి మణిదీప్ జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యాడని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీమ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 6, 10 న జమ్మూకాశ్మీర్ లోని శ్రీనగర్ నిర్వహించిన జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ అండర్ 19 ఫుట్ బాల్ ఎంపిక పోటీలలో మణిదీప్ పాల్గొని, సత్తా చాటాడని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి అండర్ 19 కబడ్డీ పోటీలకు సైతం మోడల్ కళాశాలకు చెందిన విద్యార్థిని శశిరేఖ ఎంపికైనట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన ఇచ్చిన క్రీడాకారులు మహబూబాబాద్ జిల్లాలో జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు సైతం ప్రాముఖ్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

# బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బీజేపీపై పోరాటం

## అక్టోబర్ 18న జిల్లా వ్యాప్తంగా నిరసన, ధర్నా కార్యక్రమాలు

## సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15:**




బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కాకుండా అడ్డుకుంటున్న బిజెపి మోడీ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ, అక్టోబర్ 18న బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్ ను విజయవంతం చేసి, బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే విధంగా పోరాటం కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని చెన్నూరు పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుకుంటున్న బిజెపికి తెలంగాణలో చోటు లేకుండా చేయాలని అప్పుడే సామాజికంగా వెనుకబడిన తరగతుల ప్రజలు చట్టబద్ధమైన సౌకర్యాలు పొందగలుగుతారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, గవర్నర్ కు రాష్ట్రపతికి, కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి పంపించి ఆరు నెలలు గడిచిన నేటికి బిల్లుకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. బిల్లులను తమ దగ్గరలో ఉంచుకొని నీచ రాజకీయాలు చేయడం రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్న రాష్ట్రపతి, గవర్నర్లకు సరైనది కాదని, బిజెపి మోడీ ప్రభుత్వానికి అడుగులకు మడుగులొత్తే విధంగా వీరి వైఖరి ఉందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి చట్టబద్ధత కల్పించడానికి అవకాశాలు ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేయడం కోసమే చూస్తుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలో రాష్ట్రాలలో ఒక విధంగా ఇతర రాష్ట్రాలలో మరో విధంగా వ్యవహరిస్తుందని, బిజెపి నీచ రాజకీయాల మూలంగా రాష్ట్రంలో ఉన్న బీసీలు ఇంకా సామాజికంగా వెనుకబాటుతనంలోకి నెట్టివేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి తగిన గుణపాఠం చెప్పే విధంగా కేంద్ర వైఖరిని ఎండగడుతూ పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# ఐక్య రాజ్య సమితి ప్రతినిధులతో సమావేశమైన భారత ప్రతినిధుల బృందం

## పాల్గొన్న పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15:**



ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశాల కోసం అమెరికా పర్యటనలో ఉన్న పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ బుధవారం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి పరిపాలనా, బడ్జెట్ ప్రశ్నలపై సలహా కమిటీ చైర్ పర్సన్ జూలియనా గాస్పర్ రుయాస్, ఐక్యరాజ్య సమితి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్థిక, బడ్జెట్, కంట్రోలర్ చంద్రమౌళి రామనాథన్ లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఐక్యరాజ్యసమితి ఆర్థిక పరిస్థితి, ముఖ్యంగా శాంతి భద్రతా కార్యకలాపాల నిధులపై విస్తృత చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రతినిధులు ప్రపంచ శాంతి పరిరక్షణలో భారతదేశం పోషిస్తున్న కీలక పాత్రను పునరుద్ఘాటిస్తూ, ఐక్యరాజ్యసమితి వ్యవస్థల్లో పారదర్శకత, బాధ్యత, సమర్థత వంటి అంశాలపై తమ సూచనలు అందించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, అంతర్జాతీయ ఆర్థిక, పరిపాలనా వ్యవహారాల్లో భారతదేశ స్వరాన్ని మరింత బలంగా ప్రతిధ్వనింపజేసే దిశగా మరో ముఖ్యమైన అడుగు పడిందని అభిప్రాయపడ్డారు.

# బాల్య వివాహాలను నిర్మూలించి.బాలికల విద్యను ప్రోత్సహించాలి... చైల్డ్ హెల్ప్ లైన్ సంస్థ

**వలిగొండ అక్టోబర్ 15 అక్షరకలం:**



బాలికల హక్కులు,భద్రత, విద్య,ఆరోగ్యం,సమాన అవకాశాలు,సామాజిక ఎదుగుదల పట్ల బాలికలను చైతన్యవంతులను చేయాలని,జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డిస్ట్రిక్ట్ హబ్),చైల్డ్ హెల్ప్ లైన్,జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్,స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం వలిగొండ పరిధిలోని లోతుకుంట తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికల విద్య, ఆరోగ్యం,భద్రత,బాల్య వివాహాలపై,మహిళా సాధికారతపై వివరంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికల సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని,బాల్య వివాహాల నిర్మూలన, బాలికలపై హింస నివారణ, బాలికల విద్యను ప్రోత్సహించడం వంటి అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని,ప్రతి బాలికకు సమాన అవకాశాలు,సురక్షిత వాతావరణం కల్పించడానికి సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ ఎం దశరథ, ఉమెన్ ఎంపవర్ (హబ్) భార్గవి,స్కోప్ ఎన్జీవో కోఆర్డినేటర్ వి.సోమ నరసయ్య,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రయిసున్నిసా బేగం,స్కోప్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ బి. నరసింహరాజు ,సిహెచ్. వెంకటేష్,ఉపాధ్యాయుల బృందం,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యాభివృద్ధి. డా.సంతోష్ రెడ్డి.

## ఎం వి ఆర్ విద్యార్థులకు మెడికల్ అండ్ హెల్త్ పై అవగాహన.

**నల్లగొండ, అక్టోబర్ 15 అక్షర కలం ప్రతినిది**

విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏకాగ్రతతో పాటు, మంచి చదువులు చదవడం, ఉపాధ్యాయుల బోధనలు వినడం జరుగుతుందని నల్లగొండ పట్టణంలోని తులసి హాస్పిటల్ ఎండి,ఫిజీషియన్ డాక్టర్ సంతోష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శాంతినగర్ లోని ఎంవిఆర్ స్కూల్లో శ్రీ రేవతి రామకృష్ణ మెమోరియల్ వాలంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తులసి హాస్పిటల్ డాక్టర్లు సంతోష్ రెడ్డి,సంస్కృతిలు విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి వివిధ అనారోగ్య సమస్యలున్న విద్యార్థులకు చికిత్సలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.సంతోష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి ఉన్నత చదువులు చదవ గలుగుతారని నేటి బాలలే రేపటి పౌరులనీ వీరిపైనే దేశ భవిష్యత్తుఉంటుందని అన్నారు. బుధవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయనను స్మరిస్తూ ఆయన మార్గంలో పయనించాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా విద్యార్థులు తల్లిదండ్రులు,గురువులు చెప్పిన మాటలు వింటూ వృద్ధి లోకి రావాలన్నారు. సెల్ ఫోన్లు వాడవద్దని,బయట పదార్థాలు తినొవద్దని విద్యార్థులను కోరారు, అదేవిధంగా ఉప్పు,పంచదార, మైదాపిండి వంటి పదార్థాలు అసలు వాడవద్దని, వాటితో అనారోగ్య సమస్యలు తీవ్రమైతాయన్నారు. బ్యాలెన్స్ డైట్ పాటించాలని,పండ్లు కూరగాయలు ఎక్కువ తినాలని, స్వీట్లు అసలే తినవద్దని సూచించారు. అలాగే రోజు గంట వ్యాయామం చేయాలని రోజుకు నాలుగు లీటర్ల మంచినీరు తాగాలని సూచించారు. ఏ సీజన్లో వచ్చే పండ్లను ఆ సీజన్లో తినాలని వారు సూచించారు. డైట్ లిమిట్ తో మెదడుకు ఏకాగ్రత కలుగుతుందని,దీంతో చదువులో అభివృద్ధి చెంది,ఈ దేశానికి మంచి సైంటిస్టులుగా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ఇంకా మరెన్నో ఉన్నత ఉద్యోగాలు పొంది,ఈ దేశాన్ని ముందుకు నడిపించగలుగుతారన్నారు. భవిష్యత్తులో ఎటువంటి అనారోగ్య సమస్యలు కలగకుండా విద్యార్థులందరూ హెచ్పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని డాక్టర్ కోరారు. ఈ సమావేశంలో రేవతి రామకృష్ణ మెమోరియల్ వాలంటరీ అసోసియేషన్ చైర్మన్ శేషగిరిరావు,ఎం వి ఆర్ స్కూల్స్ చైర్మన్ కొలనుపాక రవికుమార్, కరస్పాండెంట్ గీత,పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణ్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.







# మృతుని కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేత

**వలిగొండ అక్టోబర్ 15 అక్షరకలం:**



మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన నోముల మురళి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం జరిగిన ఆయన దశదిన కర్మకు (మృతుని కుటుంబానికి) అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి ఒక క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్,కమ్మంపాటి రమేష్,నోముల రాజమల్లు,వెంకటేష్,శ్రీశైలం,మహేష్,మత్స్యగిరి,మల్లేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**అక్షర కలం /ప్రతినిధి:**

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు



# పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టండి

-సిసిఐ కేంద్రాలను ప్రారంభించండి.-రైతు సంఘం డిమాండ్




**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి**

ఖమ్మం : పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ ఏడాది మునుపెన్నడు లేని రీతిలో నష్టపోయారని తెలిపారు. రైతు సంఘం సమావేశం బుధవారం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎకరాకు క్వింటా, రెండు క్వింటాళ్లకు -మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీస పెట్టుబడులు రావని వచ్చిన పత్తి కూడా వర్షాలు పడుతుండడంతో అంత నాణ్యతగా లేదని గోవిందరావు తెలిపారు. పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిహారాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ -ఆధ్వర్యంలో ప్రారంభించాలని ఆయన సూచించారు. క్వింటాకు రూ.10071 చొప్పున కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ -రంగం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని ఆయన ఆరోపించారు. కలిసిరాని ప్రకృతి, ఆదుకోని ప్రభుత్వాల మధ్య వ్యవసాయ రంగం రోజు రోజుకు -సంక్షోభంలోకి కూరుకుపోతుందని దీనిని కాపాడేందుకు వ్యవసాయ రంగ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి సిపిఐ శతాబ్ది చరిత్ర

-ఆదర్శంగా హవేలీ శాఖ

-హవేలీ సమావేశంలో నగర కార్యదర్శి జానిమియా




**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ఇంటింటికి తెలియజేయాలని ఇందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా తెలిపారు. సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రతాపనేని ఉపేందర్ అధక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా -మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభజరుగుతుందని దానికి ముందే కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరాలకు తెలియజేసేవిధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా పార్టీ ఉద్యమ చరిత్రను, అమరులైన వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు జానిమియా తెలిపారు. ఖానాపురం హవేలీ శాఖ సభ్యులు మొత్తం పార్టీ -శత వసంత ముగింపు ఉత్సవాల సందర్భంగా జరిగే కార్యక్రమాలకు ప్రతి సభ్యుడు రూ.500 విరాళంగా ప్రకటించడం -అభినందనీయమన్నారు. హవేలీ శాఖ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. పార్టీ ప్రచార కార్యక్రమానికి సంబంధించి గడప గడపకు వెళ్లేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు -దొండపాటి రమేష్, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, పార్టీ బాధ్యులు జాకీరుద్దీన్, ఆముదాల వెంకన్న, పి.వెంకటేశ్వర్లు, బానోత్ రాములు, అజీమ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించాలి..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15:**

జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో జిల్లాలోని పశువులకు టీకాలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ఇతర అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల సంబంధిత గోడ ప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 15వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగుతుందని, 4 నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు అందించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, 2 లక్షల 42 వేల పశువులకు టీకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 35 బృందాల ద్వారా 94 మంది పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు టీకాలను అందిస్తారని తెలిపారు. వ్యాధి కారణంగా పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, పునరుత్పత్తి, పని సామర్థ్యం తగ్గడంతో పాడి రైతులకు నష్టం జరుగుతుందని, దీనిని నివారించేందుకు ప్రతి పశువుకు టీకాలు అందించాలని తెలిపారు. టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవిపోగు వేసి వివరాలను భారత్ పశుధాన్ యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామ పెద్దలు, రైతులు తమ పశువులకు టీకాలు వేయించి వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కోసం కష్టపడ్డ వారికే పదవులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యం

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

ఏఐసీసీ అబ్జర్వర్ తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుల ఎంపిక సమావేశానికి హాజరు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

కొత్తగూడెం: కాంగ్రెస్ పార్టీ విస్తరణకు కృషి చేసిన, కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. ఏఐసీసీ ఆదేశానుసారం, పిసిసి సూచనలతో భద్రాద్రి కొత్తగూడెం




జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక దరఖాస్తుల స్వీకరణకు గురువారం కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం, పీసీసీ అబ్జర్వేషన్ కార్యవర్గ సభ్యులతో, పార్టీ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్యలతో కలిసి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగించారు. అంతకుముందు కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## ఎన్నికలకు ముందు పని చేసిన వారిని మర్చిపోము..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు కలిసికట్టుగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషిని ఎప్పటికీ మరువబోమని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అన్నారు. ఇదే ఐక్యతతో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ముందుకెళదామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ... రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎంతో పారదర్శకంగా పదవులకు అర్హులను ఎంపిక చేస్తుందని చెప్పారు.

## దరఖాస్తుల స్వీకరణ..

డిసిసి అధ్యక్షుల ఎంపిక కోసం ఏఐసీసీ అబ్జర్వర్, ఎంపీ రఘురాం రెడ్డి సమక్షంలో పలువురు నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం మాట్లాడుతూ.. గతంలో ఏ పార్టీ కూడా ఇలాంటి ఎంపిక ప్రక్రియ నిర్వహించలేదని, అర్హులకు పదవులు దక్కాలని కాంగ్రెస్ తొలి అడుగు వేసిందని అన్నారు. దరఖాస్తుల ఆధారంగా.. జాబితాను పిసిసికి అందజేస్తామని, అనంతరం డిసిసి అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాణాసంచా దుకాణదారులు ఖచ్చితమైన నియమ నిబంధనలు పాటించాలి

అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి**





దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలనిఅడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్ ప్రసాద్ రావు అన్నారు.బాణసంచా దుకాణాల కేటాయింపునకు



బుధవారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లాటరీ పద్దతిలో డ్రా తీసి ఒకొక్కరికి దుకాణాలు కేటాయించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. నిబంధనల మేరకునగరంలోని రెండు మైదానాల్లో 128 దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు జిల్లా అధికారులు అనుమతిచ్చారని, వీటిని ఎవరు అతిక్రమించవద్దని అన్నారు. డిగ్రీ కళాశాలలో 86, పెవిలియన్ మైదానంలో 42 ఏర్పాటు చేయాలని నిర్ణయించి డ్రా తీసినట్లు తెలిపారు. మొత్తం 148 మంది దరఖాస్తుదారుల్లో 128 దీపావళి బాణసంచా దుకాణాలు కేటాయించిన్నట్లు తెలిపారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా నగర పరిధిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బాణసంచా దుకాణదారులు బకెట్‌లలో ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఎవరైన బాణసంచా దుకాణాలు నడుపుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.బాణసంచా దుకాణాల ముసుగులో ఎవరూ కూడా డబ్బులు వసూళ్ళు చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అదేవిధంగా దుకాణదారులు ఎవరికి డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతిని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**నర్సంపేట ( అక్షర కలం, అక్టోబర్ 15)**

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు.హన్మకొండలోని పీజీఆర్ గార్డెన్స్ లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ దశదిన కర్మకు హాజరై





ఆమె చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.అనంతరం కుటుంబసభ్యులతో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వివేక్ వెంకటస్వామి,నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య,మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచందర్ నాయక్,పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజ్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# పోషణ అభియాన్ కార్యక్రమం లో చిరుధాన్యాల ప్రాముఖ్యత.

**అక్షర కలం,కొండమల్లేపల్లి.**



కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామ పరిధిలోగల ప్రాథమికోన్నత పాఠశాలలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, పోషణ మాసం సందర్భంగా ఆరు, ఏడు తరగతుల పిల్లలకు "ధాన్యాలు చిరుధాన్యాల ప్రాముఖ్యత" పై వ్యాసరచన పోటీలు, పురుషులకు వంటల పోటీలు నిర్వహించి మొదటి ,రెండవ బహుమతులను ఇవ్వటం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ ధాన్యాలు చిరుధాన్యాలు తక్కువ ఖర్చుతో పండించవచ్చని వీటిలో ఎక్కువ పోషకాలు కలిగి ఉంటాయని ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించనైనది. సిరి ధాన్యాలలో ఎన్నోఖనిజ పోషక విలువలు ఉంటాయని అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయని జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుందని, శరీరంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతాయని,శక్తినిస్తాయని ఎదుగుదలకు ఉపయోగపడతాయని సూచించనైనది.ఈ యొక్క కార్యక్రమానికి సూపర్వైజర్ వరలక్ష్మి ఏ. డబ్ల్యూ. టి .అరుంధతి ,ఏ.డబ్ల్యూ.హెచ్ .సుమతి పాఠశాల హెడ్మాస్టర్ రేణుక ,ఉపాధ్యాయులు, పిల్లలు ,తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగు యశ్వంత్ రెడ్డిని అభినందించిన ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాస్..




**చండూరు: అక్టోబర్ 15 అక్షర కలం:**

చండూరు మున్సిపాలిటీ లక్కినేని గూడెంకీ చెందిన ఏనుగు అమరేందర్ రెడ్డి, మాధవి దంపతుల కుమారుడు యశ్వంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాలలో వనపర్తి మెడికల్ కాలేజీ నందు ఎంబీబీఎస్ సీటు సాధించాడు. మెడికల్ సీట్ సాధించిన యశ్వంత్ రెడ్డిని స్థానిక గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు బుధవారం నాడు గాంధీజీ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏనుగు అమరేందర్ రెడ్డి గతంలో బైక్ మెకానిక్ చేసి, ప్రస్తుతం దంపతులిద్దరూ వ్యవసాయం చేస్తూ తనకున్న ఇద్దరు పిల్లలను కష్టపడి చదివించారని, నాలుగు సంవత్సరాల క్రితం తమ కూతురు ఏనుగు హారిక టిఆర్ఆర్ కాలేజీ పటాన్ చెరువులో ఎంబీబీఎస్ సీటు సాధించి, ప్రస్తుతం హౌస్ సర్జన్ చేస్తుందని, ఇప్పుడు కుమారుడు యశ్వంత్ రెడ్డి



మెడికల్ సీటు సాధించడం గర్వకారణమన్నారు. ఇద్దరూ విద్యార్థులు పదవ తరగతి వరకు గాంధీజీ విద్యాసంస్థల్లో చదివారని తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకొని అందరు విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. భవిష్యత్తులో వీరిద్దరూ మంచి డాక్టర్లుగా పేరు ప్రఖ్యాతులు సాధించి, ఈ ప్రాంతానికి, సమాజానికి సేవ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ భార్గవ్, పులిపాటి రాధిక, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి.

మండల పశు వైద్యులు డా. నాగయ్య.



అక్షర కలం,కొండమల్లేపల్లి.

కొండమల్లేపల్లి మండల ధోనియాల గ్రామపంచాయతీలో బుధవారం రోజున జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు మండల పశువైద్యులు గంధం నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయకపోవడం వలన పశువులు అనారోగ్యానికి గురవుతాయని గేదెలలో పాల దిగుమతి తగ్గుతుంది, ఈ కార్యక్రమంలో 15 అక్టోబర్ 2025నుండి 14 నవంబర్ 2025 వరకు జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎల్ ఎస్ ఏ పాత్లావత్ నిర్మల, గోపాల మిత్రులు భూతరాజు సైదులు, వెంకటయ్య, ధోనియాల పంచాయితీ సెక్రెటరీ రైతులు రావుల కోటేష్, రైతులు గుండాల కొండల్, బాతుక రామకృష్ణ, కల్లు వెంకటరెడ్డి, దాసరి సత్య నారి, గుండాల శీను, అందుగుల రామాంజనేయులు, ఇడమోని సైదులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ మరియు షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

–ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి ప్రతినిధి:



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ మరియు అదేవిధంగా షార్ట్ ఫిల్మ్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ (పోలీస్ ఫ్లాగ్ డే) పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహించబడుతాయని. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (3) ఫోటోలు మరియు తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోపు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 8 సైజ్ ఫోటోలనుపెన్ డ్రైవ్లో సాఫ్ట్ కాపీ నిపోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ పి ఆర్ వో సెక్షన్ లో అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సహికులు అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన. ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2024 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు) తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి వుంటుంది. మరిన్ని వివరాల కోసం 8712659256 నెంబర్ ద్వారా పీఆర్ఓ ను సంప్రదించాలన్నారు.

# నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు జీవనోపాధి

ఐ టి డి ఎ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్

అక్షర కలం/ భద్రాచలం



నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులు ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో స్థిరపడి జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఐటీడీఏ ద్వారా అందిస్తున్న వివిధ రకాల వృత్యంతర శిక్షణలు నేర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబాన్ని పోషించుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం నాడు ఐటిడిఏ సమావేశం మందిరంలో జోనల్ డ్రైవింగ్ ట్రైనింగ్ కాలేజ్ టి ఎస్ ఆర్ టి సి వరంగల్ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఎంపికై ఈనెల ఇరవై రెండు నుండి నెల రోజులపాటు శిక్షణకు వెళుతున్న గిరిజన యువకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులకు కొన్ని సూచనలు ఇస్తూ డ్రైవింగ్ శిక్షణ తీసుకునే యువకులు డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి నైపుణ్యాలు పెంపొందించుకొని పూర్తిస్థాయిలో శిక్షణతో పాటు వాహనాలకు సంబంధించిన మరమ్మత్తులు కూడా నేర్చుకోవాలని అన్నారు. సమయాన్ని వృధా చేయకుండా పట్టుదలగా కష్టపడి శిక్షణ తీసుకొని జీవితంలో స్థిరపడాలని, ముఖ్యంగా డ్రైవింగ్ చేసేటప్పుడు సిగ్నల్ సింబల్స్, క్రాసింగ్, చాలా స్పీడ్ గా డ్రైవింగ్ చేయడం వంటివి చేయకూడదని, డ్రైవింగ్ శిక్షణ తీసుకుంటున్న యువకులు తన వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు ప్రజల యొక్క జాగ్రత్తలు కూడా పాటించాలని అన్నారు. మీరు తీసుకుంటున్న ఈ శిక్షణ గురించి మీ సహచరులకు కూడా తెలియజేసి వారు కూడా ఇటువంటి వృత్యంత శిక్షణలు తీసుకొనే విధంగా వారికి అవగాహన కలిగించాలని, మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని నిరుద్యోగ గిరిజన యువతి యువకులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల వైపు దృష్టిసారించకుండా ఐటీడీఏ ద్వారా అందించే వివిధ రకాల శిక్షణలు తీసుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజన యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం కి ఘన నివాళులు..గగ్గూరి బాలకృష్ణ

అక్షర కలం /భద్రాచలం

నేడు టిఎన్జీవోస్ ప్రెసిడెంట్ మరియు సెక్రటరీ డెక్క నరసింహారావు, గగ్గురి బాలకృష్ణ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం తొంభై నాలుగోవ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలాం ఒక ప్రఖ్యాత భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త అని, అంతరిక్ష రంగంలో అతని సేవలు మరువలేనివని, అందుకే ఆయనను “మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా” అని కూడా పిలుస్తారు అని. ఆయన క్షిపణి మరియు అణు కార్యక్రమాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు, ముఖ్యంగా పొందొమ్మిది వందల తొంభై ఎనిమిది పోఖ్రాన్-%××% అణు పరీక్షల్లో ఆయనది కీలకపాత్ర, అందుకే భారత ప్రభుత్వం అతనికి పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రెజరర్ డెక్కనరసింహారావు మాట్లాడుతూ ఒక





సామాన్య మానవుడు అసాధారణ స్థాయికి ఏ రకంగా ఎదగవచ్చు అనేది కలాం జీవిత చరిత్రను చదువుకుటె అర్థమవుతుందని యావత్తు భారత యువత యువకులు అనుసరించదగ్గ వ్యక్తి అని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గాంధీ, అంజిబాబు, ప్రమోద్, అనిల్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన మహిళ కోసం కుటుంబ సభ్యులు భాద్యత తీసుకోవాలి









## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 15 (అక్షరకలం ) ప్రతినిధి :

పోషణ మాసం లో భాగంగా సూర్యాపేట పట్టణం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించడమే పోషణ మాసం లక్ష్యమని, అందుకు క్రింది స్థాయిలో కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు.గర్భిణీ ల పోషణలో ప్రతి గడపలోని అత్త, మామ, అమ్మ ,నాన్న, భర్త,పిల్లల పాత్ర , ఉంటుందని ప్రతి సమావేశంలో వీరందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ బాల్య ఆరంభ దశ సంరక్షణ, అలాగే విద్యపై దృష్టి సారించాలని, ప్రతి పిల్లవాడు వెళ్లే మొట్టమొదటి బడి అంగన్వాడి కేంద్రమేనని స్పష్టం చేశారు. పిల్లవాని అభివృద్ధికి పునాదులు వేసే అంగన్వాడి కేంద్రం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. తల్లులు, పిల్లల ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని అన్నారు.పోషకాహార లోపం లేని సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమ అధికారి కే. నరసింహారావు మాట్లాడుతూ మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యం అని ,పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుబ్బలక్ష్మి, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ జిల్లా బ్లాక్ కోఆర్డినేటర్లు,అంగన్వాడి కార్యకర్తలు ,తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్‌లపై కేంద్రం రాజకీయ ఆటలు

## బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుకట్ట వేస్తున్న కేంద్రం

## బీసీ బిల్లు అమలుకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి.

## అక్టోబర్ 17న చలో రాజ్ భవన్ ముట్టడి.

## సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:





ఖమ్మం: తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పై కేంద్రం రాజకీయ ఆటలు ఆడుతుందని, సామాజిక న్యాయం కోసం, పేద, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అవసరమైన ఈ రిజర్వేషన్లను అడ్డుకోవడం బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు లు విమర్శించారు. బుధవారం నాడు స్థానిక సుందరయ్య భవనంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పోతినేని, నున్నా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఉద్దేశంతోనే బీసీ రిజర్వేషన్ అమలు కాకుండా అడ్డుకుందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అసెంబ్లీలో చర్చ పెట్టిందని ఆ సమయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదంతో బిల్లును రాష్ట్రపతి, గవర్నర్ లకు రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని అక్కడ బిల్లు ఆమోదించకుండా కేంద్రం కావాలనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బిజెపియతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పక్షాల నాయకులను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై బలమైన ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడే ప్రయత్నాలను సిపిఎం గట్టిగా ఎదుర్కొంటుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఉద్యమాలను చేపడతామని స్పష్టం చేశారు. ఇప్పటికే స్థానిక ప్రభుత్వాలు లేకపోవడం వల్ల గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర నుంచి వచ్చే నిధులు రాకుండా పోతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. సత్వరమే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పార్టీ యంత్రాంగం సర్వేలు నిర్వహించి ఉద్యమాలు చేపడతామని తెలియజేశారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయాలని, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని అక్టోబర్ 17న చలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, వై విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, బండి పద్మ మరియు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మళ్లీ రోడ్డు ఎక్కుతున్న ఇసుక లారీలు.. రావులపల్లి రాంప్రసాద్, -రామకృష్ణ..

అక్షరకలం/ భద్రాచలం





భద్రాచలం నియోజకవర్గం లో వేలాది ఇసుక లారీల వల్ల ప్రజా రవాణాకు ఆటంకం కలుగుతుందని, అధికారులకు ప్రజాప్రతినిధులకు స్థానిక ఎమ్మెల్యేకు పట్టింపు లేనట్టుగా కనపడుతుందని.. ఎంపీలు ఎమ్మెల్యేలు కూడా ఏజెన్సీ ప్రాంతం పై చిన్నచూపు చూపుతున్నారని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ అన్నారు.. దాదాపు మూడునెలలుగా రోడ్లు విధ్వంసం అయిపోయి, రోడ్ల పక్కన ఉన్న పంట పొలాలు నాశనం అయి ప్రజలు రైతాంగం నానా ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని స్థితిలో ప్రభుత్వం లేదని ఇసుక లారీల విధ్వంసానికి గురైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి బాగు చేయాలని డిమాండ్ చేశారు... ఈ ప్రాంత సహజ సంపద ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న ఈ ప్రాంత ప్రజలును అభివృద్ధిని రోడ్లు విధ్వంసం అవుతున్న పట్టించుకునే దాఖలాలు లేవని ఈ ప్రాంతంలో సంపద దోచుకుంటూ ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతుంటే జిల్లా మంత్రులు, అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ ప్రజల్ని నయవంచనకు గురిచేస్తుందని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇసుక లారీల సమస్యపై రోడ్లు విధ్వంసమైన పట్టించుకోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ఆందోళన నిర్వహిస్తామని రావులపల్లి,మానే తెలియజేశారు కోట్లాది రూపాయల ముడుపులు ఇసుక వ్యాపారం ద్వారా చేతులు మారుతున్నాయని ప్రజాప్రతిథులు ప్రజలను పట్టించుకోవడం మరిచిపోయి ముడుపుల కోసం ప్రజలును ఇబ్బంది పెడుతున్నారని వారు పేర్కొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య ఉద్యమం నిర్మిద్దాం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

బీసీలకు లో 42% రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఖమ్మం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ అధ్యక్షుతన వివిధ కుల సంఘాల సమావేశం జరిగింది ఈ సమావేశాని ఉద్దెసించి నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కులాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న సమయంలో అన్ని కుల సంఘాలు ఒక వేదికగా అవ్వవలసిన అవసరం ఏర్పడిందని ఈ రాష్ట్రంలో 5% శాతం లేని వాళ్ళు 80% పదవులను అనుభవిస్తున్నారని 56% ఉన్న బీసీలకు మాత్రం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానంటే అడ్డుకుంటున్నారని భవిష్యత్ తరాల బీసీ బిడ్డల కోసం రాజ్యాంగబద్ధమైన మన హక్కులు సాధించుకోవడం కోసం అన్ని బీసీ కుల సంఘాలు ఒక్కటే ఐక్య ఉద్యమాలు నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు అనంతరం ఈనెల 18వ తారీకు నాడు రాష్ట్రవ్యాప్తంగా జరిగే బంద్ లో ఖమ్మం పట్టణంతోపాటుగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో బంద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు అనంతరం 14 మంది కన్వీనర్ లను నియమించారు.

# “ఎర్రబోడులో భూక్యలాలుకు” ఘనంగా పూలమాలలతో నివాళు లర్పించిన “మాజీ సర్పంచ్ కురసం-దమ్మాల పాటి ప్రసాద్..

అక్షర కలం/ కారేపల్లి:

కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామానికి భూక్యలాలు అనారోగ్యంతో ఖమ్మం జిల్లా ప్రభుత్వ హాస్పటల్లో బుధవారం మృతి చెందాడు.( 55.సంవత్సరాలు), లాలు పవిత్రమైన ఆత్మకు శాంతి జరగాలని పేర్కొన్నారు పరామర్శించిన వారిలో.మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, గ్రామ పెద్దలు దమ్మాలపాటి ప్రసాద్ అడప పుల్లారావు వజ్జా రామారావు బోజడ్ల గోవిందరావు దమ్మాలపాటి కిషన్ రావు వారిని ఓదార్చి కుటుంబానికి ధైర్యం చెప్పారు, లాలుకు భార్య ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు వారి కుటుంబానికి ఎల్లవేళలా ఆదుకుంటామని గ్రామ పెద్దలు మనోధైర్యాన్ని నింపి లాల్ కి నివాళులర్పించారు.



# 18న జరిగే 'బంద్ ఫర్ జస్టిస్' రాష్ట్ర బంద్ కు వీజేఏస్ సంపూర్ణ మద్దతు:

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీని గద్దె దింపాలి:

## మాసంపల్లి అరుణ్ కుమార్ వీజేఏస్ రాష్ట్ర అధ్యక్షుడు:

**హైదరాబాద్: అక్టోబర్ 15,**

( అక్షర కలం): బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'– (బిసి జెఎసి) 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్ కు వీజేఏస్ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, బంద్ లో ప్రత్యక్షంగా రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొంటామని విద్యార్థి జన సమితి (వీజేఏస్) రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద ఇటీవల హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బీజేపీ




కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే 9 షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ళ తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటి పోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండడం వల్లనే ఈ రోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీని భూస్థాపితం చేయాలని అన్నారు.

# పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర శిక్షణా తరగతులను జయప్రదం చేయండి.. పి.ఓ.డబ్ల్యూ



**నకిరేకల్ అక్టోబర్ 15 అక్షర కలం, ప్రతినిధి :**

ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ. డబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులను ఈ నెల 17,18న నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో జరుగుతున్నాయని, ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలనీ పి. ఓ. డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బూరుగు లక్ష్మి పిలుపు నిచ్చారు.నకిరేకల్ పట్టణ%శీ%లోని మెయిన్ సెంటర్ వద్ద శిక్షణా తరగతుల కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పి.ఓ.డబ్ల్యూ సంస్థ మహిళా సమస్యలపై, స్త్రీ, పురుష సమానత్వం కోసం గత 50సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేస్తుందని అన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలను అరికట్టాలని దశబ్దాలగా ఆందోళనలు చేస్తుందని అన్నారు. హింసకు కారనమైన మాదక ద్రవ్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యలపై నిరంతరం పి.ఓ.డబ్ల్యూ కొట్టాడుతుందని తెలిపారు. అందులో భాగంగా మహిళా కార్యకర్తలకు రాజకీయ, ఆర్థిక సామజిక అంశాలపై రాజకీయ తర్పిడు ఇవ్వడానికి అక్టోబర్ 17,18 న రాష్ట్ర శిక్షణ తరగతులు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని, ఈ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుండి 150మంది మహిళా ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యూ నాయకులు మర్రి సంతోష, పుష్ప, రాణి, ఎల్లమ్మ, ఎస్ కె సైదా, వెంకటమ్మ, స్వరూప, నాగమణి, యాదమ్మ, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ బాలింత లు పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి

## ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రణీత

**నల్లగొండ అక్టోబర్ 15 (అక్షర కలం) ప్రతినిధి :**

పోషణ మాసం సందర్భంగా తిప్పర్తి మండలం పజ్జూరు సెక్టార్ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్ల సమక్షంలో దుప్పల పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమనికి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యం పరిశుభ్రత కల్లులకు అవగాహన కల్పించారు. పోషక లోపాన్ని తగ్గించేందుకు చిరుధాన్యాలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛమైన నీటిని త్రాగాలని, పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు తాపాలని అన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన, గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు, పిల్లలకు వెల్ బేబీ షో లు నిర్వహించి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయాలు, గర్భిణీలు, పాల్గొన్నారు.



# పోషకాహారంతో రక్తహీనత దూరం..- సూపర్వైజర్ సువర్ణ

**అక్షర కలం /ప్రతినిధి :**

గర్భిణులు, బాలింతలతో పాటుగా అయిదేళ్ల లోపు చిన్నారులకు పోషకాహారం అందించడం వల్ల వారితో రక్తహీనతను దూరం చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని గుర్రంపోడు ఐసిడిఎస్ సూపర్వైజర్ సువర్ణ అన్నారు. పోషణ మాసం సందర్భంగా బుధవారం పోచంపల్లి హైస్కూల్లో విద్యార్థులకు, గర్భిణీలకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న మానవ జీవన క్రమంలో ఆహారం పట్ల సమతుల్యత పాటించడంపై ఎవరికి తగిన అవగాహన లేకపోవడం వల్ల గర్భిణులు,





బాలింతలు, చిన్నారులు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులను లక్ష్యంగా చేసుకుని ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో మంచి పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పోషణ మాసం కార్యక్రమం ద్వారా చక్కటి అవగాహన అందుతుందని, కాబోయే తల్లులు మంచి పోషకాహారం తీసుకుంటూ అనీమియా బారిన పడకుండా ఆహ్లాదకరమైన పరిస్థితులు కల్పించుకోవాలని చెప్పారు. గర్భిణీలు, పాలు ఇచ్చే తల్లులు, మహిళలు పూర్తి స్థాయిలో పోషకాలు అంటే ఆహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టి రేపటి రాబోయే రోజుల్లో బావిభారత పౌరులు అవుతారని పేర్కొన్నారు. గర్భిణీలు నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోదక శక్తి పెరుగడంతోపాటు రక్తహీనత, శక్తి, మాంసకృతుల లోపం, అయోడిన్, విటమిన్, ఏ, బీ లోపాలకు గురి కారన్నారు. పౌష్టికాహారంలోపం వల్ల బరువు తక్కువగా ఉండటం, బలహీనంగా ఉండటం వంటి సమస్యలతోపాటు శ్వాస తీసుకోవడం, గుండె కదలికలు, బుద్ధి మాంద్యం, మృత జననాలు, పిల్లల మరణాలు, పురిటి మరణాలు సంబవిస్తాయని తెలిపారు. ఆరోగ్యానికి ఉపయోగపడే ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు, ధాన్యాలు, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో హై స్కూల్ హెడ్మాస్టర్ భాస్కరరావు, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడి వర్కర్, గర్భినీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఖరీఫ్ ధాన్యం కనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

## రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ .

**నల్లగొండ, అక్టోబర్ 15 (అక్షర కలం) ప్రతినిధి :**

బుధవారం రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు,పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ,ఇతర ఉన్నతాధికారులతో హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాలు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్అనంతరం ఆదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకుగాను 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని కేంద్రాలకు అవసరమైన సామాగ్రిని పంపించామని, ఇంకా మరో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించే విషయంలో లారీల సమస్య తలెత్తకుండా చూడాలని, మిల్లుల వద్ద అన్లోడింగ్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, ఆయా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్లు ,అలాగే తేమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలని , నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు.





మండల స్థాయిలో ఐకెపి కేంద్రాలకు సంబంధించి ఏపీవోలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. హార్వెస్టర్ల వివరాలను సైతం సేకరించాల్సిందిగా ఆయన ట్రాన్స్పోర్ట్ ,పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించేందుకుగాను ముందుగా 40 లారీలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ను ఆదేశించారు.అంతక ముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం ఆల్ టైం రికార్డ్ సాధించిందని, ఈ వానాకాలం 148.3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని తెలిపారు.ఈ ఖరీఫ్ లో పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేకించి ధాన్యం రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎక్కడ రవాణా సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే విధంగా అవగాహన కల్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్మేందుకు నిరీక్షించే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని, ఈ విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని, రైతులకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. గత యసంగిలో అధికారులు, మిల్లర్లు , ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల సమన్వయంతో సత్ఫలితాలను సాధించడం జరిగిందని ఆయన తెలిపారు . రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు ధాన్యం సేకరణను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా 2025– 26 ఖరీఫ్ ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యంతో పాటు, పత్తి, మొక్కజొన్న, సోయా పంటల సేకరణ పై కూడా దృష్టి సారించాలని అన్నారు.అదనపు ఎస్పీ రమేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ ,వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ ,జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు .

# యోగాలో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

## ఆదియోగి పరమేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో



**నల్లగొండ అక్టోబర్ 15 అక్షర కలం ప్రతినిధి :**

నాలుగవ రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో మహిళా విభాగంలో నకిరేకల్ కు చెందిన సెయింట్ ఆన్స్ పాఠశాల యోగ టీచర్ కొండ నిర్మల గోల్డ్ మెడల్, విద్యార్థుల విభాగంలో కొండ యశస్విని, ఏ గాయత్రి, పి జెస్సికా, గోల్డ్ బహుమతులు పొందగా, ఎం రాకేష్, ఈ మనస్వి, జి సాయి చందర్, ఏ విశాల్, ఎన్ రక్షిత, బి హిమబిందు సిల్వర్ మెడల్స్, బీ గాయత్రి, ఆర్ శివానంద గౌడ్, పి వైష్ణవి బ్రాంచ్ మెడల్ లు పొందారు. వీరికి టి వై టి టి సి రాష్ట్ర అధ్యక్షుడు పి రవికిషోర్, ఆదియోగి ఫౌండేషన్ షన్ ప్రెసిడెంట్ పి వినోద్ బహుమతులు అందజేశారు, గెలుపొందిన వారిని పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లీనా ఆంటోనీ, ఉపాధ్యాయులు అభినందించారు.



# కార్డియో పల్మనరీ రిసల్టేషన్ ( సిపిఆర్)పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం:

## మహేశ్వరం మెడికల్ సూపరిండెంట్ డా: బి నాగేందర్:

**హైదరాబాద్: అక్టోబర్ 15,**

( అక్షర కలం): కార్డియో పల్మనరీ రిసల్టేషన్ (సీపీఆర్) పై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని మహేశ్వరం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి .నాగేందర్ అన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని అనస్తీషియా విభాగం ఆధ్వర్యం ఏరియా హాస్పిటల్ వనస్థలిపురం ప్రాంగణంలో మహేశ్వరం బి.ఎస్సీ నర్సింగ్ విద్యార్థులకి సీపీఆర్పై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. హార్ట్ ఎటాక్ సమయంలో సీపీఆర్తో బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ ,ఆర్ఎమ్ఓ డాక్టర్ రాజ్కుమార్, అనస్థీషియా హెచ్ఓడి డాక్టర్ సాదన , జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి నేతృత్వంలో నిర్వహించిన అవగాహన శిబిరంలో ప్రొఫెసర్ , డాక్టర్ తోపాటు పలువురు నర్సింగ్ విద్యార్థులు, పాల్గొన్నారు.



## ఆదమరిస్తే చుక్కలు చూడాల్సిందే...

– మెదక్ – సంగారెడ్డి ప్రధాన రహదారి దుస్థితి...



**కౌల్చారం, అక్టోబర్ 15 (అక్షర కలం):-**

అదమరిస్తే అంతే మెదక్ జిల్లా కౌల్చారం మండలం మండల పరిధిలోని మెదక్ – సంగారెడ్డి ప్రధాన రహదారిపై గత కొన్ని నేలలుగా ఏర్పడిన గుంతలు వర్షాకాలంలో నీటిలో నిండిపోవడంతో మరింత లోతుగా మారి వాహనాలకు ప్రాణాపాయం కలిగిస్తున్నాయి రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు దారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘటన పెరుగుతున్నాయి. కౌల్చారం మండలం చిన్న ఘనాపూర్ ఏడుపాయల కమాన్ వద్ద నుండి రంగంపేట వరకు మూలమలుపు రహదారి పూర్తిగా ధ్వంసం అయింది రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కౌల్చారం మండలానికి చెందిన వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు గుంతలు ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రధాన రహదారిపై అధికారులు వెళుతున్నప్పటికీ కూడా ఇట్టి రోడ్డును చూసి కూడా స్పందించకపోవడం చాలా విడ్డూరంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు మాట్లాడుతూ గత వారం రోజులైతే కొనుగోలు కేంద్రాల నుండి వడ్ల లోడుతో లారీలు వెళ్తాయి కనీసం అప్పటి వరకు ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని ప్రయాణికులు, కౌల్చారం మండలం వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలి....

– కౌల్చారం ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్...



**కౌల్చారం, అక్టోబర్ 15 (అక్షర కలం):-**

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి అని కౌల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని పైతర గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఫోన్లలో తమ పిల్లలు వివిధ కేసులలో అరెస్టు అయినట్లు వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని ఓటిపి చెప్పాలని అడిగిన ఓటిపి చెప్పొద్దని సూచించారు. ఇండ్లలోని చిన్న పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారి మాతృమూర్తి స్వర్గీయ కాంతమ్మ గారి దశదిన కర్మ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



**అక్షర కలం /ప్రతినిధి :**

హన్మకొండ వడ్డేపల్లి పీజీఆ ర్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు స్వర్గీయ కాంతమ్మ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.తరువాత దొంతి మాధవ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రితో పాటు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, వరంగల్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు కూడా నివాళులు అర్పించారు.

# ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు సిద్ధం

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట అక్టోబర్ 15వ (అక్షర కలం) ప్రతినిధి :**

బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలిసి హైదరాబాద్ నుండి 2025– 26 ఖరీఫ్ ధాన్యం సేకరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఆయా జిల్లాలలో ధాన్యం సేకరణకు చేసిన ఏర్పాట్లపై పౌరసరఫరాల శాఖ మంత్రి అడిగిన సందర్భంగా సూర్యాపేట జిల్లాకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ 2025– 26 ఖరీఫ్ సీజన్లో సూర్యాపేట జిల్లాలో 4 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేసినట్లు తెలిపారు. గత సంవత్సరం రెండు లక్షల ఇరవై ఆరువేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని ఈ ఖరీఫ్ ధాన్యం అక్టోబర్ 4వ వారం నుండి మార్కెట్ కు వచ్చే అవకాశం ఉందని ,దీనిని దృష్టిలో ఉంచుకొని ధాన్యం సేకరణ పై ఆయా శాఖల అధికారులు,సిబ్బందికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్లు, తూకం వేసే యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు ,ధాన్యాన్ని తూర్పార బట్టే యంత్రాలు, గన్ని బ్యాగులు పంపించడం జరిగిందని ,ఎలాంటి సామాగ్రి కొరత లేదని స్పష్టం చేశారు. మండలాల వారిగా ప్రత్యేక అధికారులను నియమించడమే కాకుండా, ధాన్యం కొనుగోలు కై మండల స్థాయి అధికారులను నియమించామని , ఏ మిల్లుకు ఎంత దాన్యం పంపించాలో ముందే ట్యాగింగ్ చేయడం జరిగిందని, ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో ఇదే అంశంపై సమీక్షించారు. ఈ ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం గుర్తించిన సమస్యలన్నింటిని ఈ సంవత్సరం లేకుండా చూసుకోవాలని కలెక్టర్ చెప్పారు . అన్ని శాఖల సమన్వయంతో ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని, ఇందుకు గాను






మండలాల వారిగా దొడ్డురకం, సన్న రకం కేంద్రాల వివరాలన్నీ మరోసారి తహసిల్దార్, ఎంపీడీవో ,ఏపీఎంలతో పరిశీలించాలని చెప్పారు. శనివారం నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలన్నీ పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిల పేర్లు,ఫోన్ నెంబర్లతో సహా సమర్పించాలని, ఆయా కేంద్రాలలో కొనుగోలు పరికరాలు, మౌలిక వసతుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రత్యేకించి వాహనాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దాన్యము కొనుగోలు కంట్రోల్ రూమ్ లో నోడల్ అధికారిని ఏర్పాటు చేసి వాహనాల ట్రాకింగ్ ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అలాగే ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఫిర్యాదుల రిజిస్టర్ను ఏర్పాటు చేసి ఫిర్యాదులను నమోదు చేయడమే కాకుండా, వెంటనే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం ఆల్ టైం రికార్డ్ సాధించిందని, ఈ వానాకాలం 148.3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని తెలిపారు.ఈ ఖరీఫ్ లో పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేకించి ధాన్యం రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎక్కడ రవాణా సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే విధంగా అవగాహన కల్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్మేందుకు నిరీక్షించే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని, ఈ విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని, రైతులకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. గత యసంగిలో అధికారులు, మిల్లర్లు , ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల సమన్వయంతో సత్ఫలితాలను సాధించడం జరిగిందని ఆయన తెలిపారు . రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు ధాన్యం సేకరణను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా 2025– 26 ఖరీఫ్ ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యంతో పాటు, పత్తి, మొక్కజొన్న, సోయా పంటల సేకరణ పై కూడా దృష్టి సారించాలని చెప్పారు. జిల్లా నుండి అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా పౌర పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాము, డి ఆర్ డి ఓ వి.వి అప్పారావు, డి సి ఓ పద్మ, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడి శర్మ,ట్రాన్స్పోర్ట్ అధికారి జయప్రకాష్ రెడ్డి, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

## 42 శాతం రిజర్వేషన్ల అమలకై పార్లమెంట్లో చట్టం చేయాలి



**అక్షర కలం/ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు అమలు కొరకు పార్లమెంటులో చట్టం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి నల్లగొండజిల్లా కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపుమేరకు నల్లగొండలోని స్థానిక సుభాష్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిపేందుకు కృషి చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ల పేరుతో పార్లమెంటులో చట్టం చేయకుండా బీసీల జీవితాలను నాశనం చేసే చర్యలకు పాల్పడడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదనే నిబంధనతో కోర్టులు సామాజిక అసమానతలను తొలగించి సామాజిక న్యాయాన్ని అందించకుండా 77 ఏండ్ల స్వాతంత్ర దేశంలో రాజ్యాంగ సవరణలు చేయవలసిన పరిస్థితిలో కుంటి సాకులతో అనేక నిబంధనలతో బీసీల ఎదుగుదలకు అడ్డుకట్ట వేయడం సరైన వైఖరి కాదని ఆయన పేర్కొన్నారు . రాష్ట్రంలో రాజకీయాలకతీతంగా సామాజిక న్యాయం కొరకు సమాజంలో సగభాగం ఉన్న ప్రజల హక్కుల కొరకు జరుగుతున్న పోరులో అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ,, గీత పని వాళ్ళ సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 18 నాడు రాష్ట్ర బంద్ లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి , శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య,ఎ ఐ ఎ స్ ఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ ,ఎండి యూసఫ్ ,ఎం నందం. సుజాత ,విజయ ,మాధవి ,నారాయణ ,దశరథ ,రామకోటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని పరామర్శించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ:

**హైదరాబాద్: అక్టోబర్ 15,**

( అక్షర కలం): తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డీల్లీ లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ని మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించారు. మంత్రితో కలసి పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఉన్నారు.





మల్లికార్జున ఖర్గేకు ఇటీవల ఫేస్ మేకర్ ని వైద్యులు అమర్చినట్లు సమాచారం. పరామర్శించిన అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ ఖర్గేతో సమావేశమై రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహలపై నేతలు చర్చించారు.

## నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలి..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15:**

ప్రభుత్వం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట లో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం గుడిపేట లో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా



అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ సమాజ అభివృద్ధిలో మహిళల కృషిని ప్రభుత్వాలు గుర్తించాలి

### తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతే

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15:**

గ్రామీణ సమాజ అభివృద్ధిలో మహిళల కృషిని ప్రభుత్వాలు గుర్తించాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతే అన్నారు. బుధవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళల కృషి అపూర్వమని, వారి కృషిని ప్రభుత్వాలు గుర్తించి, వారి హక్కులను రక్షించాలన్నారు. ప్రభుత్వాలు వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలను కల్పించాలని కోరారు. అనేక కీలక రంగాల్లో మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కృషికి తగిన గుర్తింపు లేకుండా, గ్రామీణ మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యా అవకాశాల కొరత, ఆరోగ్య సౌకర్యాల లోపం, ఆస్తి హక్కుల నుండి వంచన, పేదరికం, బాల్య వివాహాలు, లైంగిక వివక్ష, శ్రమను గుర్తించకపోవడం వంటి సమస్యలతో గ్రామీణ మహిళలు నేటికీ సతమతమవుతున్నారని అన్నారు. కనుక ప్రభుత్వాలు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు సమాజం మహిళల సమస్యల పరిష్కారానికి కలిసి పని చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ మహిళల అభ్యున్నతికి తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ నాయకులు సయ్యద్ యూసఫ్, మండల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955